


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

12.09.2026
శనివారం | రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 74
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్నాం

- బ్రిక్స్ దేశాలు రెట్టింపు వేగంతో పుంజుకున్నాయి.
- సీమాంతర ఉగ్రవాదం మోదీ కామెంట్
- అనేక రకాలుగా ఉగ్రవాద ముప్పు
- అన్ని ప్రయత్నాలకు భారత్ నిరంతరం మద్దతిస్తోంది
- బిజినెస్ ఫోరంలో మోదీ కీలక వ్యాఖ్యలు

2లో..



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11, అనంతజనశక్తి న్యూస్**

అమెరికాలో 9/11 దాడులు జరిగి పాతికేళ్లు అయిన నేపథ్యంలో మృతులకు ప్రధాని నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు. ఉగ్రవాదం వల్ల ప్రపంచవ్యాప్తంగా లెక్కలేనన్ని మరణాలు చోటుచేసుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీమాంతర ఉగ్రవాదంతో భారత్ దశాబ్దాలుగా పోరాడుతూనే ఉందన్నారు. 'ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదం లెక్కలేనన్ని ప్రాణాలను బలిగొంది. సీమాంతర ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ అనేక దశాబ్దాలుగా పోరాటం చేస్తోంది. ఉగ్రవాద ముప్పు అనేక రకాలుగా మారుతోంది.

## పరస్పరం నమ్మకంతో వ్యాపార సంబంధాలు

### రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్




2లో..

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11, అనంతజనశక్తి న్యూస్**

బిక్స్ 2026 సమ్మిట్ వేళ ఏర్పాటు చేసిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్'లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పులు, వ్యాపార భాగస్వామ్యాల ప్రాధాన్యత గురించి ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. వ్యాపార బంధాలే వెన్నుముక పరస్పరం నమ్మకంతో కూడిన వ్యాపార సంబంధాలు, ఆర్థిక భాగస్వామ్యాలే అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారమని, ఇవి ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించడానికి, దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి దోహదపడతాయని పుతిన్ పేర్కొన్నారు. గతంలో గ్లోబల్ ఆర్థిక వృద్ధికి నాయకత్వం వహించిన పాత శక్తుల (ఆర్థిక వ్యవస్థలు) స్థానంలోకి కొత్త ఆర్థిక యంత్రాలు వస్తున్నాయని, ఇది సహజమైన మార్పు అని ఆయన వ్యాఖ్యానించారు.

## జెన్ ఆల్ఫా, జెన్ బీటాపైనే నా ఫోకస్

- సీఎం రేవంత్ రెడ్డి కామెంట్
- తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్
- విద్యకు భారీగా నిధులు
- 10,600 మంది టీచర్ల నియామకం
- డీఎస్సీపై ఆరోపణలు లేవు
- హార్వర్డ్ వర్సిటీ రాక
- పాలిటెక్నిక్‌ల ప్రైవేటీకరణ లేదు
- స్కిల్ వర్సిటీలతో అవకాశాలు
- పేదల కోసమే విద్యాశాఖ



**హైదరాబాద్, సెప్టెంబర్ 11, అనంత జనశక్తి న్యూస్**

**అందరూ జెన్ జీ గురించి ఆలోచిస్తే.. తాను మాత్రం జెన్ ఆల్ఫా, జెన్ బీటా గురించి ఆలోచిస్తున్నానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశం భవిష్యత్ తరగతి గదుల్లో ఉందని సంపూర్ణంగా విశ్వసిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచంలోనే ఉత్తమ విద్యా విధానాలను రాష్ట్రానికి తీసుకొస్తున్నామన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యకు రూ.18,955 కోట్లు కేటాయిస్తే.. 2025-26లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.23,729 కోట్లు, 2026-27లో రూ.27,663 కోట్లు కేటాయించిందని తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా విద్యాశాఖపై జరిగిన చర్చలో సీఎం సుదీర్ఘంగా మాట్లాడారు.**

పేదలకు మేలు జరగాలనే విద్యాశాఖ నా వద్ద..

"బడ్జెట్‌లో విద్యకు 15శాతం కేటాయించాలనేదే నా లక్ష్యం. పేదలకు మేలు జరగాలనే కీలకమైన విద్యాశాఖను నా వద్ద ఉంచుకున్నా. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థలు 28,163 ఉన్నాయి. 28.77 లక్షల మంది విద్యార్థులు అందులో చదువుతున్నారు. ఈ మూడేళ్లలో విద్యాశాఖపై రూ.7,554 కోట్లు అదనంగా ఖర్చు పెట్టాం. విద్యా హక్కు చట్టం ప్రకారం 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాలి. కానీ, తెలంగాణలో మాత్రం 17 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉన్నారు. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 11 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చాం. 55 రోజుల్లో 10,600 మందికి ఉపాధ్యాయ నియామక పత్రాలు అందజేశాం. ఏ చిన్న ఆరోపణ కూడా లేకుండా డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తి చేశాం. 10ఏళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ 7,857 మంది టీచర్లను నియమించింది. వచ్చే ఏడాది రాష్ట్రానికి హార్వర్డ్ వర్సిటీ రాబోతోంది. లండన్ వర్సిటీ, నార్త్ ఈస్టర్న్, వర్జీనియా వర్సిటీలూ రాబోతున్నాయి.

తెలంగాణకు పటేదార్ అని చెప్పుకొనే ఒకాయన గుంటూరులో చదువుకున్నారు. పటేదార్‌తో కొట్లాడే సోదరీమణి పిల్లలూ అమెరికాలో చదువుతారు. గుంటూరులో చదివిన ఆయన బంట్రోతు ఉద్యోగానికి కూడా పనికిరాడు. ఆయన్ను మన నెత్తిన పెట్టారు. నేను పేదరికంలో పుట్టాను.. ప్రభుత్వ స్కూళ్లలో చదివాను. ఆయనకు ఇంగ్లీష్ వస్తుందని నేను అసూయపడుతున్నానని అంటున్నారు. ఆయన్ను చూసి అసూయపడేవాళ్లు లేరు.. అసహ్యించుకునేవారే ఉన్నారు.

5లో..

## పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించాలి



- కలెక్టర్లతో మంత్రి లోకేష్
- ఆ దిశగా కలెక్టర్లు కార్యాచరణ రూపొందించాలి
- పాఠశాల భవనాలు పటిష్టంగా ఉండాలి
- ఉద్యోగ అవకాశాలు లభించే విధంగా నైపుణ్యాభివృద్ధి

**అమరావతి, సెప్టెంబర్ 11, అనంతజనశక్తి న్యూస్**

పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించే దిశగా కలెక్టర్లు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. బోర్డు పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

2లో..

## దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని భూదోపిడీ

- భూబకాసురులదే రాజ్యం
- ఇందిరమ్మ రాజ్యం కాదు
- కాంగ్రెస్ నాయకులపై కేటీఆర్ ఫైర్
- భూములను కాపాడాల్సిన కాపలాదారులే..
- కబ్జాదారులుగా మారారని మండిపాటు

2లో..



**హైదరాబాద్, సెప్టెంబర్ 11, అనంత జనశకతి న్యూస్**

ఇందిరమ్మ రాజ్యంలో భూబకాసురలదే రాజ్యమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని భూదోపిడీ జరుగుతోందని ఆరోపించారు.

## నేతన్నలకు ఊరట

- నూతన నేతన్న భరోసా పెన్షన్ దరఖాస్తులో కీలక నిబంధన మినహాయింపు
- బ్యాంకు ఖాతాల స్టేట్‌మెంట్ ఇవ్వాల్సిన అవసరం లేదు
- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత



2లో..

## ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- విశాఖలో రెండవ రోజు జరిగిన ఐపటీఓ సదస్సులో మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం
- టూర్ ఆపరేటర్లు, ప్రముఖ హోటల్ గ్రూప్‌లతో మంత్రి కందుల దుర్గేష్ సుదీర్ఘ భేటీ.. కీలక అంశాలపై చర్చ

2లో..



## కేసీఆర్ ప్రజల గురించి ఆలోచిస్తున్నారు

- రేవంత్ రెడ్డి భూముల గురించి ఆలోచిస్తున్నాడు
- మాజీ మంత్రి హరీశ్ రావు
- రియల్ ఎస్టేట్ వ్యాపారులుగా మారారు
- పొంగులేటిపై సంచలన కామెంట్లు


2లో..



## ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెంపు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

5లో..



## రాష్ట్రంలో 3,736 మద్యం దుకాణాలే..
## ఏడాది పాటు కొనసాగింపు

- మద్యం విక్రయాలపై ఇక డిజిటల్ నిఘా.. ప్రతి దుకాణంలో నాలుగు సీసీ కెమెరాలు
- లైసెన్సుల రెన్యువల్‌కు 38 శాతం రిటైల్ ఎక్సైజ్ పన్ను.. కొత్త పాలసీ జారీ

5లో..

**అమరావతి , సెప్టెంబర్ 11: అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్రంలో 202627 సంవత్సరానికి కొత్త ఎక్సైజ్ షాప్స్ పాలసీని ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం ఉన్న 3,736 మద్యం దుకాణాల సంఖ్యను యథాతథంగా కొనసాగిస్తూ 2026 అక్టోబర్ 1 నుంచి 2027 సెప్టెంబర్ 30 వరకు ఏడాది పాటు కొత్త పాలసీ అమలు చేయనుంది.




## కులగణన అత్యంత ఆవశ్యం

- దేశానికే ఆదర్శం
- తెలంగాణ కులగణన మోడల్
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- సమగ్ర కుటుంబ సర్వే దేశంలోనే..
- ఒక సరికొత్త అధ్యాయానికి శ్రీకారం

2లో..



**హైదరాబాద్, సెప్టెంబర్ 11, అనంతజనశక్తి న్యూస్**

**తెలంగాణ శాసనసభ వేదికగా బలహీన వర్గాల హక్కులు, కులగణన అంశంపై తీవ్రస్థాయిలో చర్చ జరిగింది. ఈ సందర్భగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సభలో ప్రసంగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ప్రాధాన్యతను స్పష్టం చేశారు. రాష్ట్రంలో తాము అమలు చేసిన విధానాలు దేశానికే దిశానిర్దేశం చేస్తున్నాయని, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం చేకూరాలంటే కులగణన అత్యంత ఆవశ్యకమని ఆయన పేర్కొన్నారు.**

## పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. విద్యా ప్రమాణాల పెంపుతోపాటు పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లా కలెక్టర్లతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. విద్యాశాఖకు సంబంధించిన వివిధ అంశాలపై వారికి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. పాఠశాల భవనాలు పటిష్టంగా ఉండటంతోపాటు, నూతన నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలను వివిధ పరిశ్రమలతో అనుసంధానిస్తూ, వాటికి అవసరమైన నైపుణ్యాలను యువతకు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్య పూర్తయిన తర్వాత ఉద్యోగ అవకాశాలు లభించే విధంగా నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు 'నైపుణ్యం' వెబ్ పోర్టల్ ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలతోపాటు అవసరమైన స్కిల్ టూల్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నామని మంత్రి వెల్లడించారు. విద్యాసంస్థలు, పరిశ్రమలు, యువత మధ్య సమన్వయం పెంచడం ద్వారా ఉపాధి అవకాశాలను మరింత విస్తృతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. మరోవైపు, ఏపీలో అక్షరాస్యత పెంపుతోపాటు డిజిటల్, ఫైనాన్షియల్ లిటరసీపైనా విద్యాశాఖ దృష్టి సారించిందని లోకేశ్ తెలిపారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్వీయ రక్షణ చర్యలపైనా పాఠశాలల్లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. కరిక్యులమ్ మార్పుపై ఇప్పటికే రోడ్‌మ్యాప్‌ను రూపొందించుకుని ముందుకు సాగుతున్నామని తెలిపారు. విద్యార్థుల్లో భవిష్యత్ నైపుణ్యాలను పెంపొందించేలా విద్యా విధానంలో అవసరమైన మార్పులు చేపడుతున్నామని మంత్రి లోకేశ్ చెప్పుకొచ్చారు.

## ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్నాం



(మొదటి పేజీ తరువాయి)

ఆ మహమ్మారిని ఎదుర్కోవడానికి ప్రపంచవ్యాప్తంగా జరుగుతోన్న అన్ని ప్రయత్నాలకు భారత్ నిరంతరం మద్దతిస్తోంది' అని సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. 2014లో న్యూయార్క్‌లోని 9/11 మెమోరియల్ మ్యూజియాన్ని సందర్శించినప్పటి దృశ్యాలను కూడా ప్రధాని పంచుకున్నారు.

బ్రిక్స్ దేశాలు రెట్టింపు వేగంతో పుంజుకున్నాయని ప్రధాని మోడీ అన్నారు. బ్రిక్స్ బిజినెస్ ఫోరంలో మోడీ ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్రిక్స్ ద్వారా భారతదేశం ప్రపంచానికి చేరుకుంటుందన్నారు. బ్రిక్స్‌లో ఉన్న 21 దేశాల కుటుంబం ప్రపంచంలో సగానికి సమానం అని వ్యాఖ్యానించారు. 2006లో ఈ కూటమిని ప్రారంభించినప్పుడు కేవలం నాలుగు దేశాలే ఉన్నాయన్నారు. ఇప్పుడు బ్రిక్స్ భాగస్వామ్య దేశాలతో కలిసి 21 దేశాల కుటుంబంగా మారిందని తెలిపారు. ఈ దేశాలు ప్రపంచ జనాభాలో 50 శాతమని.. ప్రపంచ వాణిజ్యంలో 25 శాతం వాటా కలిగి ఉన్నాయని పేర్కొన్నారు.

ఆర్థిక వృద్ధి ప్రపంచ వృద్ధి రేటు కంటే రెండింతలు వేగవంతమైందని తెలిపారు. క్షేత్రస్థాయి నుంచి అత్యాధునిక సాంకేతికల వరకు బ్రిక్స్ దేశాలు కొత్త ఆవిష్కరణలు ఆవిష్కరించాయని చెప్పారు. బ్రిక్స్ పెరుగుతున్న స్థాయి, వేగం, ఆశావాదం స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. ప్రపంచంలో సంక్షోభం ఉన్నప్పటికీ భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. అంతరిక్షం, బయోటెక్‌తో పాటు అనేక రంగాల్లో కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయన్నారు. 'మేక్ ఇన్ ఇండియా', 'ఇన్నోవేట్ ఇన్ ఇండియా', 'సేల్ ఫర్ ది వరల్డ్' వంటి కార్యక్రమాలు కింద భారతదేశంలో ఒక స్టార్టప్ విప్లవం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రపంచంలో వ్యాపారానికి ఉన్న అడ్డంకులు అన్ని తొలగించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

**పుతిన్‌కు మోదీ 'తిరుక్కురళ్' గిఫ్ట్**

బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలకు ముందు ప్రధాని నరేంద్రమోడీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ద్వైపాక్షిక సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సమయంలో ప్రధాని నరేంద్రమోడీ ప్రాచీన తమిళ గ్రంథం, తిరువళ్లవర్ రచించిన ''తిరుక్కురళ్'' రష్యన్ అనువాదాన్ని బహుమతిగా ఇచ్చారు. ఈ గ్రంథం విశిష్టతను మోడీ, పుతిన్‌కు వివరించారు. అయితే, ఈ గ్రంథం ఏమిటి అని చాలా మందిలో ఆసక్తి పెరిగింది.

మనిషి జీవనం, రాజు రాజ్య పాలనకు సంబంధించిన అనేక అంశాలను తిరుక్కరళ్ చర్చిస్తుంది. సంక్షేమ రాజ్యం ఎలా ఉండాలి, మంత్రులు ఎలా ప్రవర్తించాలని 2000 ఏళ్ల నాటి ఈ గ్రంథంలో రచించారు. ఇందులోని రష్యా ప్రజలను కూడా ప్రేరేపిస్తుందని ప్రధాని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. 2026లో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్లాసికల్ తమిళ్ ప్రచురించిన ఈ ప్రత్యేక ఎడిషన్‌లో అసలు తమిళ పద్యాలతో దాని రష్యన్ లిపి, రష్యన్ అనువాదం ఉన్నాయి. నైరా మ్కర్ట్‌చ్యాన్ ఈ రష్యన్ అనువాదాన్ని చేశారు.

**రష్యాతో లింక్..**

ఈ బహుమతికి మరో ప్రత్యేకత కూడా ఉంది. భారతీయ తత్వశాస్త్రం, సాహిత్యంపై రష్యాలో ఆసక్తికి శతాబ్దాల చరిత్ర ఉంది. 17వ శతాబ్దం నుంచే రష్యాలో భారతీయ తత్వంపై ఆసక్తి ఉన్నట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. యూరోపియన్ అనువాదాల ద్వారా తిరుక్కురళ్ కూడా రష్యన్ మేధావులు, సాహితీవేత్తల్ని ఆకర్షించింది.

రష్యా రచయిత లియో టాల్‌స్టాయ్ 19వ శతాబ్దంలో తిరుక్కురళ్‌తో సంబంధం ఏర్పడినట్లు చెబుతుంటారు. ధర్మం, కరుణ, అహింస వంటి అంశాలను తిరుక్కురళ్ ప్రస్తావిస్తుందని, ఇవి టాల్‌స్టాయ్ తాత్విక ఆలోచనలపై ప్రభావం చూపిందనే అభిప్రాయాలు ఉన్నాయి. టాల్‌స్టాయ్, మహాత్మా గాంధీ మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాల్లో దీని ప్రస్తావన ఉన్నట్లు చెబుతుంటారు. టాల్‌స్టాయ్ మహాత్మా గాంధీకి తిరుక్కురళ్‌ను సూచించారని, దాని బోధనల వల్లే గాంధీ అహింసా సిద్ధాంతంపై ప్రభావం చూపాయని చెబుతుంటారు.

**మూడు భాగాలుగా తిరుక్కురళ్..**

తిరువళ్లువర్ రచించిన తిరుక్కురళ్‌లో మొత్తం 1330 ద్విపదలు, 133 అధ్యాయాలు ఉన్నాయి. ఇది 3 విభాగాలుగా ఉంటుంది. అరం(ధర్మం), పొరుల్(అర్థం), ఇన్బమ్ (కామం) అనేవి విభాగాలుగా ఉన్నాయి. హిందూ తత్వంలోని ధర్మ, అర్థ, కామ భావనలతో పోలిక ఉంటుంది. అయితే, మోక్షం గురించి దీనిలో ప్రస్తావన లేదు. క్రీస్తుపూర్వం 300 నుంచి క్రీ.శ 500 మధ్య తిరుక్కురళ్ రచించబడినట్లు భావిస్తుంటారు.

మోడీ గతంలో 2019లో బ్యాంకాక్‌లో థాయ్ అనువాదాన్ని ఆవిష్కరించారు. అప్పటి జపాన్ ప్రధానికి తిరుక్కురళ్ జపనీస్ అనువాదాన్ని అందించారు. 2023లో పాపువా న్యూగినియాలో జరిగిన ఒక సదస్సులో టోక్ పిసిన్ అనువాదాన్ని ఆవిష్కరించారు. ఇటీవల, 2026 ఆగస్టులో తాష్కెంట్ పర్యటన సందర్భంగా తిరుక్కురళ్ ఉజ్బెక్ భాషలోకి అనువదించాలని ప్రతిపాదించారు.

## నేతన్నలకు ఊరట

**అమరావతి సెప్టెంబర్ 11, అనంత జనశక్తి ప్రతినిధి**

నూతన నేతన్న భరోసా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్న చేనేతలకు ఊరటనిచ్చేలా కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. నేతన్న భరోసా పథకం కింద పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే చేనేతలు బ్యాంకు స్టేట్ మెంట్ అందజేయాల్సిన అవసరం లేదని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. మాస్టర్ వీవర్ నుంచి వేతనాలు తీసుకున్న వివరాలు అందజేస్తే సరిపోతుందన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని రకాల పెన్షన్లు ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల ఏడో తేదీ నుంచి వృద్ధాప్యం, వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగులు, చేనేత సహా అన్ని రకాల పెన్షన్లకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో నేతన్న భరోసా పెన్షన్ కు దరఖాస్తు చేస్తుకుంటున్న నేతన్నలకు బ్యాంకు ఖాతాల స్టేట్ మెంట్ నిబంధన తీవ్ర ప్రతిబంధకంగా మారింది. మాస్టర్ వీవర్ దగ్గర పనిచేసే చేనేతలకు వ్యక్తిగతంగానే వేతనాలు చెల్లిస్తూ వస్తుంటారు. అటువంటి సమయంలో బ్యాంకు ఖాతాల స్టేట్ మెంట్ నిబంధన పెట్టడంతో చేనేతలు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఇదే విషయమై పలువురు నేతన్నలు, చేనేత సంఘాల ప్రతినిధులు మంత్రి సవిత దృష్టికి సమస్యను తీసుకొచ్చారు. తక్షణమే ఆమె స్పందించి, సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి చేనేతల సమస్యను తీసుకెళ్లారు. బ్యాంకు ఖాతాల స్టేట్ మెంట్ నిబంధనను సడలించాలని సీఎం చంద్రబాబు ఆదేశించడంతో, అర్హులైన చేనేతలందరికీ నేతన్న భరోసా పెన్షన్లు అందజేసే అవకాశం కలిగిందని మంత్రి సవిత తెలిపారు. నూతన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే నేతన్నలు బ్యాంకు ఖాతా స్టేట్ మెంట్ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. 50 ఏళ్లు నిండిన నేతన్నలందరికీ నేతన్న భరోసా పెన్షన్లు అందజేస్తామని, అర్హులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. ఆయా జిల్లాల చేనేత, జౌళి శాఖాధికారులు బ్యాంకు ఖాతాల స్టేట్ మెంట్లు లేకున్నా దరఖాస్తులు తీసుకోవాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో వేలాది మంది నేతన్నలకు ఉపశమనం కలగనుందని మంత్రి సవిత తెలిపారు. నేతన్నలకు ఆర్థిక మేలు చేకూర్చడమే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 85 వేల మందికిపైగా నేతన్నలకు నేతన్న భరోసా పెన్షన్ పథకం కింద రూ.4 వేలు చొప్పున అందజేస్తున్నామన్నారు. ఉచిత విద్యుత్, నేతన్నల సేవలో పథకం కింద ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని మంత్రి సవిత గుర్తు చేశారు.

## పరస్పరం నమ్మకంతో వ్యాపార సంబంధాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచ జీడీపీ లో దేశాల భాగస్వామ్యం గత ఐదేళ్లలో 40 శాతానికి పైగా ఉంటే, G7 దేశాల వాటా కేవలం 29 శాతానికే పరిమితమైందని గణాంకాలతో వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీతో పాటు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా, భారత విదేశాంగ మంత్రి డా. ఎస్. జైశంకర్, వాణిజ్య మంత్రి పియూష్ గోయల్, ఇతర భాగస్వామ్య దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యూఢిల్లీలో జరుగుతున్న 8వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ .. పాశ్చాత్య దేశాలను లక్ష్యంగా చేసుకున్నారు. ప్రపంచం నిరంతరం మారుతోందని, జీ7 కూటమిని బ్రిక్స్ అధిగమించిందని, పాశ్చాత్య దేశాలు క్రమంగా బలహీనపడుతున్నాయని పేర్కొన్నారు. బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ నాయకుల సమావేశంలో వ్లాదిమిర్ పుతిన్ మాట్లాడుతూ ''ప్రపంచం ప్రస్తుతం ప్రగాఢమైన, గణనీయమైన మార్పులకు లోనవుతోంది.. ఎందుకంటే, 20వ శతాబ్దపు ద్వితీయార్ధంలో ఆర్థికాభివృద్ధిలో అగ్రగామిగా ఉన్న దేశాల స్థానంలో ఇప్పుడు కొత్త వృద్ధి చోదకాలు వస్తున్నాయి. నేను 'పాత' అని చెప్పడం కేవలం ఒక నానుడి మాత్రమే. నేను దేని గురించి మాట్లాడుతున్నానో మనందరికీ తెలుసు'' అని వ్యాఖ్యానించారు. పాశ్చాత్య దేశాలను లక్ష్యంగా చేసుకున్న పుతిన్ ''ఈ పాత నాయకులు అని పిలవబడే వారికి ఇప్పటికీ చాలా బలమైన పదవులు, అత్యంత అభివృద్ధి చెందిన మౌలిక సదుపాయాలు, సాంకేతిక, శాస్త్రీయ ప్రయోజనాలు, శాస్త్రీయ పాఠశాలలు మొదలైనవి ఉన్నాయి. ఇది విచారకరమే, కానీ అది వాస్తవ స్వభావం కాదు. అది మానవత్వం,ఆర్థిక వ్యవస్థ స్వభావం కాదు. ప్రపంచం ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుంది'' అని ఆయన అన్నారు.

''గత ఐదేళ్లుగా ప్రపంచ జీడీపీలో 40 శాతానికి పైగా వాటాను బ్రిక్స్ దేశాలు అందిస్తే.. జీ7 దేశాలు కేవలం 29 శాతం మాత్రమే అందించాయి. అదే సమయంలో, ప్రపంచ ఆర్థిక వృద్ధిలో సగానికి పైగా వాటాను బ్రిక్స్ దేశాలు అందించగా, జీ7 దేశాలు కేవలం 18 శాతం వాటాను మాత్రమే కలిగి ఉన్నాయి. ఇది ఎందుకిలా ఉంది? సమాధానం చాలా సులభం.. ప్రపంచ జనాభాలో సగానికి పైగా బ్రిక్స్ దేశాలలో నివసిస్తున్నారు, అందువల్ల, వారికి చాలా చైతన్యవంతమైన, శక్తివంతమైన దేశీయ మార్కెట్లు ఉన్నాయి'' అని వ్లాదిమిర్ పుతిన్ ఉద్ఘాటించారు. అంతకు ముందు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య గంట పాటు ద్వైపాక్షిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇరువురి మధ్య పలు అంశాలు చర్చకు వచ్చాయి.

## కేసీఆర్ ప్రజల గురించి ఆలోచిస్తున్నారు

**హైదరాబాద్, సెప్టెంబర్ 11, అనంతజనశక్తి న్యూస్**



కేసీఆర్ ప్రజల గురించి ఆలోచిస్తే సీఎం రేవంత్ రెడ్డి భూముల గురించి ఆలోచిస్తున్నాడని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో 22A నిషేధిత జాబితా స్కాంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో నేడు 22ఏ భూముల గురించి పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. సీఎం రేవంత్ భూముల చుట్టూ తిరుగుతున్నాడు. రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీనివాస్ రెడ్డి పొంగులేటి రియల్ ఎస్టేట్ వ్యాపారులుగా మారారని విమర్శించారు.

ఒక్క కలం పోటుతో ఊళ్లకు ఊళ్లను 22ఏలో పెట్టిస్తున్నారు. గ్రామాలకు గ్రామాలను 22ఏలో పెట్టడమేంటని ప్రశ్నించారు. భూమి ప్రజల ఆస్తి, వారి హక్కు అనే విషయాన్ని మర్చిపోవదన్నారు. ఈ ప్రభుత్వం భూమిని మార్కెట్ వస్తువులా చూస్తున్నది. నిన్నటి వరకు హైడ్రా, నేడు 22ఏ పేరుతో ప్రజలతో చెలగాటమా డుతున్నారు. ప్రభుత్వమే ప్రజలకు భరోసా లేకుండా చేస్తే ఎలా అని ప్రశ్నించారు. ఇక ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్‌సీయూ భూములను బాంబే స్టాక్‌ఎక్సేంజ్‌లో కుదువపెట్టి 10 వేలే కోట్ల అప్పు తీసుకొచ్చారు. రేవంత్ ఏం చేసినా దానికి వెనుక భూములను కాజేసే కుట్ర ఉంటుందని ఆరోపించారు. ఈ ప్రభుత్వాన్ని ప్రజలే 30 పర్సంటేజ్ ప్రభుత్వం అంటున్నారని గుర్తు చేశారు.

మేము సెంటు భూమి కూడా 22ఏ లిస్టులో పెట్టలేదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వమే పెట్టిందని మంత్రి పొంగులేటి అంటున్నాడు. కానీ వివిధ జిల్లాల్లో పెద్ద ఎత్తున 22ఏ లిస్టులో పెడుతూ కలెక్టర్లకు లేఖలు రాసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. వారు సీసీఎల్ ఆదేశాలతోనే ఇలా చేశామని చెప్తున్నారు. భూభారతిలో దేవాదాయ, వక్ఫ్ భూములు లేవు. పెట్టాల్సినవి పెట్టకుండా ప్రజల ఆస్తులను పెట్టారని విమర్శించారు.

**శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలి**

కలెక్టర్ల మెడపై కత్తిపెట్టి 22ఏ లిస్టులో భూములను పెట్టించారని, కేసీఆర్ సమస్యలను పరిష్కరిస్తే రేవంత్ సమస్యలు సృష్టించారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఒక్క సెంట్ భూమి కూడా మా ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చలేదన్న వ్యాఖ్యలపై ఆధారాలతో సహా కౌంటర్ ఇచ్చారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో 22A నిషేధిత జాబితా స్కాంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 11092025 రోజున కొత్త నిషేధిత జాబితా లిస్ట్ పంపాలని ప్రభుత్వం ఆదేశాలు ఇస్తూ జీవో జారీ చేశారు. 20112025న జనగామ కలెక్టర్ నిషేధిత జాబితా లిస్ట్ తయారు చేసి ఐజీ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌కు పంపారని తెలిపారు. ఐజీ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కలెక్టర్ పంపిన భూముల జాబితాను 22A నిషేధిత జాబితాలో పెడుతూ నోటిఫికేషన్ ఇచ్చింది. ఇలా అన్ని జిల్లాల్లో పెట్టారన్నారు. సిర్పూర్ - కాగజ్ నగర్ ప్రాంతంలో 30 వేల ఎకరాలు అక్టోబర్ 2025లో నిషేధిత జాబితాలో పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే మంచిర్యాల నియోజకవర్గంలో 11 వేల ఇండ్లు నిషేధిత జాబితాలో పెట్టారు. 33 జిల్లాల కలెక్టర్లు ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే భూములను నిషేధిత జాబితాలో పెట్టాలని లిస్ట్ తయారు చేసి ప్రభుత్వానికి పంపింది నిజం కాదా అని ప్రశ్నించారు. అన్ని జిల్లాల కలెక్టర్ల జీవోల ఆధారాలతో చూపించాం.. చీము నెత్తురు ఉంటే పొంగులేటి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని భూదోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

భూములను కాపాడాల్సిన కాపలాదారులే కబ్జాదారులుగా మారారని మండిపడ్డారు. కోటి ఎకరాల ప్రజా సంపదను కొల్లగొట్టే కుతంత్రం జరుగుతోందని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో సెక్షన్ 22ఏ భూ బాధితులతో కేటీఆర్, హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడకముందు రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, భూముల విషయంలో ప్రజల్లో అనేక అనుమానాలు ఉండేవని గుర్తుచేశారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు నెలల్లోనే కరెంటు, తాగునీటి సమస్యలను పరిష్కరించారని అన్నారు. రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమిచ్చేలా ఒకే రోజులో జీవోలు ఇచ్చారని తెలిపారు. కేసీఆర్ పాలనలో ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు, బాసర నుంచి భద్రాచలం వరకు పుష్కలంగా సాగునీరు అందిందని కేటీఆర్ అన్నారు. అప్పట్లో ఎకరం రూ.5 లక్షలుగా ఉన్న భూమి విలువ రూ.50 లక్షలకు పెరిగిందని పేర్కొన్నారు. భూమి సురక్షితమైన పెట్టుబడి అనే నమ్మకం ప్రజల్లో ఏర్పడిందని, అలాంటి పరిస్థితిని ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా మార్చేస్తోందని విమర్శించారు.

'భూమి కనబడితే బుక్క పెట్టు.. జాగా కనబడితే పాగా వేయ్' అన్నట్లుగా పరిస్థితి తయారైందని కేటీఆర్ ఆరోపించారు. 'గాంధీల సామంతుల పాలనలో గజానికో గజదొంగ.. గుంటకో గుంటనక్క' అన్నట్లుగా వ్యవహారం సాగుతోందని వ్యాఖ్యానించారు. 'ఇందిరమ్మ రాజ్యంలో భూబకాసురలదే రాజ్యం' అని మండిపడ్డారు.

కోటి 16 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చారని కేటీఆర్ ఆరోపించారు. బకాసుర బ్రదర్స్‌కు భూములపై కన్ను పడిందని వ్యాఖ్యానించారు. 'మంత్రులు కాదు.. అలీబాబా 40 దొంగలు' అంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. మంచిరేవుల భూకుంభకోణం బయటపడిన తర్వాత ఒక మంత్రి బర్తరఫ్ అయ్యారని తెలిపారు. మంత్రులు, ముఖ్యమంత్రి మధ్య పర్సంటేజీల యుద్ధం జరుగుతోందని ఆరోపించారు. ఇది '30 పర్సెంట్ కమీషన్ల సర్కార్' అని విమర్శించారు.

హరీశ్‌రావు నాదర్‌గుల్ భూముల వ్యవహారాన్ని బయటపెట్టారని కేటీఆర్ తెలిపారు. 22ఏ వ్యవహారం మహా కుంభకోణమని అన్నారు. సిరిసిల్ల జిల్లా సముద్రలింగాపూర్‌లో రైతులకు చెందిన 800 ఎకరాల భూములను నిషేధిత జాబితాలో పెట్టారని ఆరోపించారు. ఎస్ఐఆర్‌లోనూ చాలామంది ఓట్లు కోల్పోయారని అన్నారు.

రాష్ట్రంలో ఒక సమాంతర రెవెన్యూ వ్యవస్థ నడుస్తోందని కేటీఆర్ ఆరోపించారు. బయటకు కనిపించేది ఒక వ్యవస్థ అయితే.. చీకట్లో మరో వ్యవస్థ పనిచేస్తోందని అన్నారు. ఫైళ్లు ఎవరి ఆదేశాలతో కదులుతున్నాయో అర్థం కాని పరిస్థితి ఉందని విమర్శించారు. దళితులు, గిరిజనులకు చెందిన అసైన్డ్ భూములు మాయమవుతున్నాయని ఆరోపించారు. లగచర్లలో రేవంత్‌రెడ్డి తన అల్లుడి కోసం గిరిజన భూములు గుంజుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్ చుట్టూ వేల ఎకరాల భూములపై కన్ను పడిందని అన్నారు. గుడి, బడి, ఆస్పత్రి, స్మశానవాటిక కోసం ప్రభుత్వం దగ్గర ఎకరం భూమి కూడా లేదని చెబుతూ.. అస్మదీయుల కోసం మాత్రం హిల్ట్ పాలసీ తీసుకొచ్చారని విమర్శించారు. పది వేల ఎకరాలను కాజేసే కుట్ర జరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. భూములను అడ్డికి పావుశేరు లెక్కన విక్రయిస్తున్నారని, మూసీ పేరుతో వేల ఎకరాలను మింగే కుట్ర జరుగుతోందని అన్నారు. ఫార్మాసిటీని రద్దు చేసి ఫ్యూచర్ సిటీ పేరుతో భూదందాలకు తెరలేపారని ఆరోపించారు. రూ.200 కోట్ల విలువైన భూమిని రూ.7 కోట్లకే ఇచ్చారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో కొంగరకలాన్‌కు ఫాక్స్‌కాన్ సంస్థ వచ్చిందని, దీంతో అక్కడి భూములకు భారీ డిమాండ్ ఏర్పడిందని కేటీఆర్ గుర్తుచేశారు.

## ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

**విశాఖపట్నం సెప్టెంబర్ 11 అనంత జనశక్తి న్యూస్**

భారతదేశంలో ఉన్న అద్భుతాలన్నీ ఏపీలోనే ఉన్నాయని.. ఈ నేపథ్యంలో ఏపీ ఇచ్చే మధురమైన అనుభూతులను ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటకులకు పంచుదామని పర్యాటక ప్రతినిధులకు పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలోని 'నోవోటెల్' వేదికగా జరుగుతున్న ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ 41వ వార్షిక సదస్సు రెండో రోజు కార్యక్రమంలో భాగంగా మంత్రి కందుల దుర్గేష్ పలువురు ప్రముఖ టూర్ ఆపరేటర్లు, హోటల్ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేంద్ర పర్యాటక శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ సుమన్ బిల్లాకు మంత్రి కందుల దుర్గేష్ స్వాగతం పలికారు. అంతకుముందు పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్.ఎస్. రావత్, టూరిజం ఎండీ పట్టాన్ శెట్టి రవి సుభాష్ రాష్ట్రంలో నూతన పర్యాటక విధానం 202419 ద్వారా అందిస్తున్న పెట్టుబడి అనుకూల అవకాశాలు, ప్రాధాన్యతలను ఆపరేటర్లకు సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..'స్ట్రాంగర్ టుగెదర్' అనే నినాదంతో మేమంతా ముందుకు సాగుతున్నాం. రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని శైవ క్షేత్రాలు, దివ్య క్షేత్రాలు, పంచారామాలు, గోదావరి పరివాహక ప్రాంతాలు, సమీప ప్రాశస్త్యం ఉన్న ఆలయాలను అనుసంధానిస్తూ అద్భుతమైన ఆధ్యాత్మిక టూర్ ప్యాకేజీలను సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. టూర్ ఆపరేటర్లు, విమానయాన సంస్థలు, హోటల్ యాజమాన్యాలు పర్యాటక శాఖతో చేతులు కలిపి సరికొత్త, ఆకర్షణీయమైన టూర్ ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అలాగే పర్యాటకులకు ఆధ్యాత్మిక ప్రశాంతతను అందించేలా మరిన్ని పర్యాటక ప్యాకేజీలను రూపొందించి గోదావరి పుష్కరాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**ఏపీలో 7 స్టార్ హోటళ్లు ఏర్పాటుకు 'లీలా గ్రూప్' ఆసక్తి**

సదస్సులో భాగంగా 'లీలా గ్రూప్' ప్రతినిధులు మంత్రి కందుల దుర్గేష్‌తో భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రపంచస్థాయి 7 స్టార్ హోటళ్లను నెలకొల్పేందుకు లీలా గ్రూప్ యాజమాన్యం తమ సంసిద్ధతను వ్యక్తం చేసింది. రాష్ట్రంలో పర్యాటక రంగాభివృద్ధికి టూర్ ఆపరేటర్లు, ఆతిథ్య రంగా ప్రతినిధుల సహకారం అత్యంత కీలకమని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

**వియత్నాం నుంచి నేరుగా ఏపీకి విమాన సర్వీసులు నడిపేందుకు సుముఖత**

వియత్నాం ట్రావెల్ అసోసియేషన్ ఆపరేటర్లతో మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇన్‌బౌండ్ టూరిజాన్ని ప్రోత్సహించడంలో భాగంగా వియత్నాం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు సన్ పొకాకో ఎయిర్‌లైన్స్ సర్వీసులు నడిపేందుకు వారు సానుకూలత వ్యక్తం చేశారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో చర్చించి ఈ అంశంపై త్వరలోనే ముందడుగు వేస్తామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. అలాగే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని *'ఓపెన్ స్కై ఎయిర్‌పోర్ట్' గా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతామని, రాష్ట్ర పర్యాటకాన్ని 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌లో వేగంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.

**ఆధ్యాత్మిక, గిరిజన పర్యాటకానికి ప్రత్యేక ప్యాకేజీలు:**

హాలిడే వరల్డ్ ప్రతినిధులతో జరిగిన భేటీలో వారు 'ట్రైబల్ సర్కిల్' ప్యాకేజీలను మంత్రికి వివరించారు. గిరిజన సంస్కృతి, జీవన విధానం ప్రతిబింబించేలా ప్రత్యేక పర్యాటక సర్క్యూట్లను రూపొందించాలని మంత్రి సూచించారు.

**పర్యాటక, ఆతిథ్య రంగ దిగ్గజాలతో సుదీర్ఘ చర్చలు:**

ఈ సందర్భంగా జి.ఆర్.టి హోటల్స్, ది పార్క్, ఐటీసీ , తాజ్ గ్రూప్, రాడిసన్ బ్లూ, నోవోటెల్, లేక్ ప్యాలెస్, లెమన్ ట్రీ, బెస్ట్ వెస్ట్రన్ ప్లస్, ఫార్చ్యూన్, జింజర్, రాయల్ పోర్ట్, గాదిరాజు ప్యాలెస్, డాల్ఫిన్, గ్రీన్ పార్క్ తదితర హోటల్ గ్రూప్‌ల ప్రతినిధులతో పాటు ఎయిర్ ఇండియా, ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రతినిధులతో మంత్రి దుర్గేష్ సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు , పర్యాటక రంగాన్ని బలోపేతం చేసేందుకు, అనుసంధానం కోసం ప్రభుత్వం తరఫున పూర్తిస్థాయి సహకారం, రాయితీలు అందిస్తామని హామీ ఇచ్చారు. పర్యాటక రంగ వృద్ధి వేగవంతం, ఏఐ సాంకేతికత ఆధారిత టూర్ ఆపరేటింగ్, విధాన నిర్ణయాలు , సందర్శకుల నిర్వహణ ద్వారా సుస్థిర పర్యాటకం సాధించడం తదితర అంశాలపై విస్తృతస్థాయి చర్చలు జరిగాయి. కేంద్ర పర్యాటక శాఖ అదనపు కార్యదర్శి సుమన్ బిల్లా, ఉత్తరప్రదేశ్ పర్యాటక శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి అమృత్ అభిజాత్, ఏపీ పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ ఎస్ఎస్ రావత్, పర్యాటక రంగ నిపుణులు నకుల్ ఆనంద్ లు, ఐఏటీవో ప్రెసిడెంట్ రవి గోసైన్, ఎక్స్ ప్లర్ర్ సీఈవో జితిన్ భాటియా, అసెగో సీఈవో దేవ్ కర్వాత్, ఏఐ ట్రాన్స్‌ఫర్మేషన్ కోచ్ రాకీ జగతియాని, మైపార్ట్‌నర్, ట్రిప్ మనీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ అభిషేక్ లోగానీ, ట్రావ్ క్లాన్ కో ఫౌండర్ చిరాక్ అగర్వాల్, మధ్యప్రదేశ్ టూరిజం బోర్డు అడిషనల్ ఎండీ అభయ్ అరవింద్ బెడేకర్, ఎయిర్ ఇండియా హెడ్ ఆఫ్ సేల్స్ మనీష్ పురి, అబెర్ క్రోంబీ, కెంట్ ఎండీ విక్రమ్ మాథోక్ , లీలా ప్యాలెస్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ వైస్ ప్రెసిడెంట్ సేల్స్ మేఘా అజ్‌గాంకర్, ఫార్ హారిజన్ టూర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సంజయ్ బసు,ఉత్తర ప్రదేశ్ పర్యాటక శాఖ ఎకో టూరిజం డైరెక్టర్ పుష్ప కుమార్, మడ్డీ బూట్స్ వెకేషన్స్ ఇండియా ఎల్ఎల్‌పి ప్రదీప్ మూర్తి , కురుక్షేత్ర యూనివర్సిటీ ప్రతినిధురాలు మంజుల చౌదరి,జీఆర్‌టీ హోటల్స్ & రిసార్ట్స్ సీఈవో విక్రమ్ కోటా , వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ ట్రస్ట్ సీఈవో డాక్టర్ అనీష్ అందేరియా తదితరులు పాల్గొని సుదీర్ఘంగా చర్చించారు. మోడరేటర్ లుగా ఆసియా ఎడిటర్ స్కిఫ్ట్ పెడెన్ డోమా భూటియా, ఐఏటీఓ సీఓఓ రాహుల్ చక్రవర్తి, టూరిజం ఫ్యూచర్స్ ఏఐ నవీన్ కుందు, ఇండియన్ స్కూల్ ఆఫ్ నేచర్ ఫౌండర్ రామ్ ప్రతాప్ సింగ్ తదితరులు వ్యవహరించారు. ఆ తర్వాత సాయంత్రం మంత్రి కందుల దుర్గేష్ జీఆర్టీ, పార్క్, ఐటిసి,తాజ్, మేఘాలయ హోటల్, అరకు మౌంటెన్ వ్యూ, లెమన్ ట్రీ, బెస్ట్ వెస్ట్రీన్ ప్లస్ తేజ్ వివాన్, మనీ ఎంటర్ప్రైజెస్, మాన్ ట్రిస్ హోటల్, వాన రిసార్ట్స్, ఎస్ వి ఎన్ లేక్ ప్యాలెస్, అతిధి హాలిడేస్, హోటల్ గ్రీన్ పార్క్, రాక్ డెల్ hotel, బెస్ట్ వెస్ట్రీన్ ప్లస్ రామచంద్ర, ఫార్చ్యూన్, జింజర్, ఇకంటి బ్లిస్, షెల్టన్, వెంకీ రెసిడెన్సి, రాయల్ పోర్ట్, గాదిరాజు ప్యాలెస్ కన్వెన్షన్ సెంటర్, డాల్ఫిన్ హోటల్, ఎలిగెంట్, నోవాటెల్, ది పార్క్, టాతస్, రాడిసన్ బ్లూ రిసార్ట్ తదితర హోటల్ ప్రతినిధులతో, ఎయిర్ ఇండియా ఇండిగో ఎయిర్‌లైన్స్, వీటిజెడ్ ట్రావెల్ లింక్స్ వంటి సంస్థల ప్రతినిధులతో భేటీ అయి సుదీర్ఘంగా చర్చించి వారికి ప్రభుత్వం తరఫున అవసరమైన సంపూర్ణ సహకారం అందిస్తామని వెల్లడించారు. అనంతరం ఛత్తీస్ ఘడ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్,రాజస్థాన్,పంజాబ్, పశ్చిమబంగా, గుజరాత్, ఢిల్లీ పర్యాటక శాఖల ప్రదర్శన లు చేశారు..

## కులగణన అత్యంత ఆవశ్యం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే దేశంలోనే ఒక సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని భట్టి విక్రమార్క అన్నారు. ఈ సర్వే నిర్వహణ తీరు, పారదర్శకతను పరిశీలిస్తే తెలంగాణ మోడల్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. గతంలో ఈ సర్వే చేపట్టినప్పుడు ప్రతిపక్ష సభ్యులు సహా అందరూ సభలోనే ప్రభుత్వాన్ని, ఈ విధానాన్ని మనస్ఫూర్తిగా అభినందించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

**దేశవ్యాప్త కులగణనకై కేంద్రంపై ఒత్తిడి**

కేవలం రాష్ట్రానికే పరిమితం కాకుండా, కేంద్ర ప్రభుత్వం నిర్వహించబోయే జాతీయ జనగణనలో తప్పనిసరిగా కులగణనను ఒక భాగంగా చేర్చాలని తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన పట్టుదలతో ఉందన్నారు. దేశవ్యాప్తంగా సామాజిక సమతుల్యత సాధించాలంటే ఇది ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ఇదే విజ్ఞప్తితో ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రుల బృందం స్వయంగా ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి, సంబంధిత పెద్దలకు వినతిపత్రాలు సమర్పించిన విషయాన్ని ఆయన సభకు వివరించారు.

**రాజకీయాలకు అతీతంగా ఏకమవ్వాలి**

కులగణన సరిగ్గా జరగడం లేదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను భట్టి విక్రమార్క తప్పుబట్టారు. తెలంగాణ సాధించిన ఈ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని, దేశవ్యాప్తంగా అమలు చేసేలా అందరం కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. కులాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఏకమై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

**సామాజిక న్యాయమే అంతిమ లక్ష్యం**

సమాజంలో వెనుకబడిన, బలహీన వర్గాల ప్రజలకు తగిన ప్రాతినిధ్యం, న్యాయం అందాలంటే సరైన ప్రామాణిక డేటా అవసరమని, దానికి కులగణన ఒక్కటే సరైన మార్గమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. స్వల్ప రాజకీయ ప్రయోజనాలను పక్కనబెట్టి, బలహీన వర్గాల ఆకాంక్షలను నెరవేర్చే ఈ బృహత్తర కార్యాన్ని అందరూ ముక్తకంఠంతో సమర్థించాలని కోరారు.



# సాధ్వీగా మారేందుకు 20 ఏళ్ల యువతికి అనుమతి..

**- మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు**



ఓ 20 ఏళ్ల యువతి భౌతిక సుఖాలను త్యజించి, తాను సాధ్వీగా మారాలని నిర్ణయించుకుంది. అయితే, తమ కుమార్తె నిర్ణయాన్ని తల్లిదండ్రులు, ఆమె బంధువులు తీవ్రంగా వ్యతిరేకించారు. అందరిలాగే తమ కుమార్తెకు పెళ్లిచేసి, అత్తారింటికి పంపాలని భావించిన ఆ తల్లిదండ్రులు వద్దని వారించారు. కన్న కూతురిపై మమకారంతోనే వాళ్లు అభ్యంతరం చెప్పారు. దీంతో ఆమె న్యాయస్థానానికి వెళ్లారు. హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడంతో.. విచారణ చేపట్టింది. ఆమె తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించి, మద్దతు తెలిపింది.

ప్రాపంచిక సుఖాలను త్యజించి, సన్యాసం స్వీకరించాలని నిర్ణయించుకున్న ఓ 20 ఏళ్ల యువతికి మధ్యప్రదేశ్ హైకోర్టు మద్దతుగా నిలిచింది. తన మతాన్ని స్వేచ్ఛగా అనుసరించే, ఆచరించే ప్రాథమిక హక్కు ఆమెకు ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. అంతేకాదు, యువతి సహాయం కోరితే తల్లిదండ్రుల నుంచి ఎలాంటి బలవంతం లేదా వేధింపులు ఎదురుకాకుండా రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు ఇండోర్ ధర్మాసనం తీర్పు వెలువరించింది. తనీషా అనే యువతి దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై జస్టిస్ సందీప్ ఎన్. భట్ విచారణ చేపట్టారు.

తాను శ్వేతాంబర్ జైన ధర్మాన్ని అనుసరించి, సన్యాసం స్వీకరించాలని నిర్ణయించుకున్నట్టు ఆమె కోర్టుకు వివరించారు. అయితే, ఈ నిర్ణయాన్ని తన తల్లిదండ్రులు, బంధువులు వ్యతిరేకిస్తూ వేధిస్తున్నారని, తనకు పోలీసు రక్షణ కల్పించాలని అభ్యర్థించారు. అంతేకాదు, మత పరమైన దీక్షలో తల్లిదండ్రులు, బంధువులు జోక్యం చేసుకోకుండా నిరోధించాలని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 21, 25, 26 ప్రకారం తనకు లభించే ప్రాథమిక హక్కులను స్వేచ్ఛగా ఉపయోగించుకోవడానికి అనుమతించాలని ఆమె కోరారు. పిటిషనర్ తరపున హాజరైన న్యాయవాది ఆశిష్ జోషి వాదనలు వినిపిస్తూ.. రక్షణ కల్పించాలని ఇండోర్ పోలీస్ కమిషనర్‌కు ఇప్పటికే ఫిర్యాదు చేశామని, అది ఇంకా పెండింగ్‌లో ఉందని తెలిపారు. పిటిషనర్‌పై ఆమె తల్లిదండ్రులు లేదా బంధువుల నుంచి ఎలాంటి వేధింపులు, బలవంతం లేకుండా చూడాలని కోరారు. ప్రభుత్వం తరపున అడ్వకేట్ గర్విత్ జైన్ హాజరయ్యారు. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి.. మేజర్ అయిన ఆమెకు 'తనకంటూ ఒక మార్గాన్ని ఎంచుకుని మతాన్ని అనుసరించే, తన ఇష్టానుసారం జీవించే హక్కు ఉంది' అని పేర్కొన్నారు. ఆమె ఇప్పటికే జైన ధర్మాన్ని అనుసరిస్తోందని, ఇప్పుడు ప్రపంచాన్ని విడిచి పెట్టి సాధ్వీగా జీవించాలని నిర్ణయించుకుందన్నారు. అయితే తల్లిదండ్రులు, బంధువులు ఆమెపై ఉన్న ప్రేమానురాగాల వల్ల అడ్డుకోడానికి ప్రయత్నిస్తున్నారని కోర్టు గుర్తించింది. సమాజంలో పలుకుబడిన కలిగిన తల్లిదండ్రులు తనను దీక్ష తీసుకోనివ్వరనే పిటిషనర్ భయాన్ని కూడా కోర్టు నమోదు చేసింది. ఈ సందర్భంగా ''పిటిషనర్ పట్ల ఎంత సానుభూతి ఉందో, ఆమె తల్లిదండ్రుల పట్ల కూడా అంతే సానుభూతి ఉంది'' అని ధర్మాసనం పేర్కొంటూ, తల్లిదండ్రుల వ్యతిరేకత కూతురిపై ఉన్న మమకారం నుంచే వచ్చిందని గుర్తించింది. అయినప్పటికీ, 18 ఏళ్లు నిండిన వ్యక్తికి చట్టపరమైన హక్కుల రక్షణ పొందే హక్కు ఉందని, చట్టం దృష్టిలో ఎవరైనా కలిగించే అడ్డంకులను అనుమతించలేమని స్పష్టం చేసింది. 'లతా సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ యూపీ' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. మేజర్లు తమ స్వంత నిర్ణయాలు తీసుకోవడానికి స్వతంత్రులని, అలాంటి వారి ప్రయోజనాలను కాపాడటం కోర్టుల బాధ్యత అని పునరుద్ఘాటించింది. అంతేకాకుండా, పిటిషనర్ దరఖాస్తు చేసుకుంటే పోలీసులు ఎలా వ్యవహరించాలో సూచించడానికి 'శక్తి వాహిని వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' తీర్పును కూడా ఉదాహరించింది.

పూర్తిస్థాయి ప్రాథమిక రక్షణ ఉత్తర్వులు ఇవ్వడానికి బదులుగా హైకోర్టు ఒక పరిష్కారాన్ని చూపింది. తన తల్లిదండ్రులతో సహా ఎవరైనా బలవంతం చేస్తే సహాయం కోరుతూ ఎస్పీ లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాలని పిటిషనర్‌ను ఆదేశించింది. అలాంటి దరఖాస్తు అందగానే, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారి వెంటనే రంగంలోకి దిగి సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

ఈ ఆదేశాలతో హైకోర్టు ఆ రిట్ పిటిషన్‌ను ముగిస్తూ.. పిటిషనర్ సహాయం కోరితే పోలీసులు జోక్యం చేసుకోవచ్చని స్పష్టం చేసింది. అదే సమయంలో, ఒకరి మత పరమైన ఎంపికను వారి కుటుంబం శాసించలేదని స్పష్టమైన వ్యాఖ్యలు చేసింది.

# "లాల్ మందిరే టార్గెట్.. కానీ ట్రాఫిక్ వల్ల ఎర్రకోట వద్దే పేల్చేశారు":



**- కారు బాంబ్ బ్లాస్ట్‌పై ఎన్ఐఏ సంచలనం**

దేశరాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద చోటుచేసుకున్న కారు బాంబు పేలుడు ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) న్యాయస్థానంలో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ కేసు దర్యాప్తులో అత్యంత కీలకాంశాలు, షాకింగ్ వివరాలు వెలుగులోకి వచ్చాయి. ముష్కరుడు ఉమర్ ఉన్ నబీ పేలుడు పదార్థాలతో కూడిన ఐ20 కారుతో ముందుగా వేరే ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకున్నాడని.. అయితే అనుకోని పరిస్థితుల వల్ల ప్లాన్ మార్చుకుని ఎర్రకోట గేట్ వద్దకు చేరుకుని దాడికి పాల్పడ్డాడని ఎన్ఐఏ తన ఛార్జ్‌షీట్‌లో స్పష్టం చేసింది.

**లాల్ మందిర్‌యే టార్గెట్.. కానీ 13 నిమిషాల్లోనే స్కెచ్ ఛేంజ్!**

ఎన్ఐఏ సేకరించిన సీసీటీవీ దృశ్యాల ప్రకారం.. ఉమర్ ఉన్ నబీ నవంబర్ 10వ తేదీ సాయంత్రం 6.37 గంటలకు పేలుడు పదార్థాలున్న కారును చాందినీ చౌక్ సమీపంలోని లాల్ మందిర్ వద్ద నిలిపేందుకు ప్రయత్నించాడు. అతడి లక్ష్యం అదే అయి ఉంటుందని దర్యాప్తు సంస్థ అనుమానిస్తోంది. అయితే ఆ సమయంలో అక్కడ విపరీతమైన రద్దీతో పాటు భారీగా పోలీసు బందోబస్తు ఉండటంతో ఉమర్ తన వ్యూహాన్ని మార్చుకున్నాడు. లాల్ మందిర్ నుంచి ముందుకు వెళ్లి యూటర్న్ తీసుకుని.. సాయంత్రం 6.50 గంటలకు ఎర్రకోట గేట్ నంబర్4 వద్దకు చేరుకున్నాడు. కేవలం 13 నిమిషాల వ్యవధిలోనే కారు బాంబును పేల్చివేసి ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు సృష్టించాడు.

**షూలో రిమోట్.. డీఎన్ఏ పరీక్షలతో విశ్లేషణ!**

ఈ దాడికి ఉమర్ వినూత్నమైన, ప్రమాదకరమైన పద్ధతిని ఎంచుకున్నట్లు ఆధారాలు లభించాయని ఎన్ఐఏ తెలిపింది. ముఖ్యంగా అతను వేస్కున్న ఓ షూలో ప్రత్యేకంగా అమర్చిన రిమోట్ కమాండ్ మెకానిజం సహాయంతో బాంబును డిటోనేట్ చేసినట్లు ఎన్ఐఏ తెలిపింది. పేలుడు స్థలం వద్ద లభించిన ఉమర్ షూ భాగానికి ఒక లోహపు ముక్క అతుక్కుని ఉండటాన్ని గుర్తించి విశ్లేషించారు. దానిని రసాయన పరీక్షలకు పంపగా... అందులో ట్రైఅసిటోన్ ట్రైపెరాక్సైడ్ (టీఏటీపీ), పొటాషియం, అమ్మోనియం నైట్రేట్ పదార్థాలు ఉన్నట్లు తేలింది. అలాగే కారు శిథిలాల వద్ద లభించిన నమూనాలు ఉమర్ తల్లిదండ్రుల డీఎన్ఏతో నూరు శాతం సరిపోలినట్లు దర్యాప్తు అధికారులు వెల్లడించారు.

**టెర్రర్ మాడ్యూల్ లింకులు..!**

జమ్మూ కశ్మీర్‌లోని నౌగామ్‌లో జరిగిన మరో పేలుడు ఘటనలోనూ, ఫరీదాబాద్‌లో ఉమర్ అనుచరుల నుంచి స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాల్లోనూ ఒకే రకమైన రసాయనాలు ఉన్నట్లు నిర్ధారణ అయింది. దీని ఆధారంగా దేశంలో అంతర్గతంగా పనిచేస్తున్న ఒక పెద్ద టెర్రర్ మాడ్యూల్ ఉనికిని ఎన్ఐఏ ధ్రువీకరించింది. దాడికి వాడిన టీఏటీపీ రసాయనాన్ని ఎప్పుడూ అత్యంత చల్లని వాతావరణంలో నిల్వ ఉంచాల్సి ఉంటుందని.. అందుకే ఉమర్ తన గదిని ఎల్లప్పుడూ చల్లగా ఉంచేవాడని, ఆ గది నుంచి వింత దుర్వాసన వచ్చేదని కొందరు సాక్షులు ఇచ్చిన వాంగ్మూలం ద్వారా కేసు దర్యాప్తులో మరింత పురోగతి లభించింది.

# చిన్నారుల అపహరణ కేసుల్లో ఏకరూప దర్యాప్తు

**- కేంద్రం, రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు**



బాలికలను బలవంతంగా తీసుకెళ్లిపోవడం, చిన్న పిల్లల అపహరణ వంటి కేసుల్లో దర్యాప్తునకు ఏకరూప నిబంధనలను అమలు చేయాలని, నిర్ణీత కాల వ్యవధినీ విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై కేంద్రం, రాష్ట్రాలు, లా కమిషన్‌కు సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. మానవ అక్రమ రవాణా వెనుక వ్యవస్థీకృత నేర ముఠాల హస్తం ఉంటోందని, ఈ కేసుల సత్వర పరిష్కారానికి దర్యాప్తులో వినూత్న విధానాలను అనుసరించాలని పిటిషనరు అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక కోర్టుల ఏర్పాటు ఆవశ్యకత ఉందని తెలిపారు. ఆయా అంశాలపై తమ వైఖరేమిటో తెలపాలని కేంద్రం, రాష్ట్రాలను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఆదేశించింది.

చిన్నారుల సామాజిక మాధ్యమాల వినియోగంపై..: సామాజిక మాధ్యమ వేదికలను వినియోగించే చిన్నారులకు కల్పించాల్సిన రక్షణల విషయమై కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ, న్యాయశాఖల స్పందనకు సుప్రీంకోర్టు ఆదేశించింది. 18ఏళ్లలోపు చిన్నారులతో సామాజిక మాధ్యమ వేదికలు ఎలాంటి ఒప్పందం చేసుకోకుండా నిరోధించాలని స్వచ్ఛంద సంస్థ.. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయెన్స్ ఈ పిటిషన్ దాఖలు చేసింది. చిన్నారులకు కొన్ని రక్షణలు అవసరమేనని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం అభిప్రాయపడింది.

# పీఏసీ సూచనల్ని విస్మరించడం పార్లమెంటుకు అవమానకరం



**- ఛైర్మన్ కేసీ వేణుగోపాల్ వ్యాఖ్య**

**సెస్సులు, లెవీల రూపంలో వసూలు చేసే మొత్తాలను ఖర్చు చేస్తున్న తీరుపై పార్లమెంటు 'ప్రజా పద్దుల సంఘం' (పీఏసీ) అభ్యంతరం వ్యక్తం చేసింది. 2024-25లో ఇలా వసూలైన రూ.9,222 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వ రిజర్వు నిధుల్లోకి జమ చేయలేదని కాగ్ ఇటీవల ప్రస్తావించిన నేపథ్యంలో పీఏసీ సమావేశంలోనూ ఆ అంశం చర్చకు వచ్చింది. అలా జమ కాకపోవడానికి ఆర్థిక మంత్రిత్వశాఖ ఇచ్చిన వివరణలపై కొందరు పీఏసీ సభ్యులు అభ్యంతరాలు తెలిపారు. ఏ అవసరం కోసం వసూలు చేసే మొత్తాలను ఆ అవసరం కోసమే వాడాలని ఛైర్మన్ కె.సి.వేణుగోపాల్ అధ్యక్షతన మంగళవారం జరిగిన పీఏసీ సమావేశం స్పష్టం చేసింది. 2023లో పార్లమెంటుకు స్థాయీ సంఘం సమర్పించిన నివేదికలోనూ ఈ అంశం ఉందని ఛైర్మన్ గుర్తు చేశారు. ఆయా మొత్తాలను ఎంతకాలంపాటు వసూలు చేశారు.. అనుకున్న లక్ష్యాలను సాధించారా.. సెస్సును సక్రమంగా ఆయా నిధిలో జమ చేస్తున్నారా.. లేదా.. అనేది శాస్త్రీయంగా మదించాలని నివేదికల్లో ఉందని పేర్కొన్నారు. పీఏసీ సూచనల్ని విస్మరించడం పార్లమెంటుకు అవమానకరమని కాంగ్రెస్ సీనియర్ నేత అయిన వేణుగోపాల్ వ్యాఖ్యానించారు. పేదలు, మధ్య తరగతి, పన్ను చెల్లింపుదారుల నుంచి లెవీగా మొత్తాలను వసూలు చేసేది ప్రభుత్వ బడ్జెట్ల లోటు పూడ్చేందుకు కాదని స్పష్టీకరించారు.**

**కాగ్ గుర్తించిన ఇతర అంశాలు..**

- **2024-25లో సెస్సులు, సర్‌ఛార్జీలు, లెవీల రూపంలో రూ.3.89 లక్షల కోట్లను వసూలు చేశారు. స్థూల పన్నుల ఆదాయంలో అది 10.25 శాతం.**
- **ప్రధాన మంత్రి స్వాస్థ్య సురక్షా నిధి కింద రూ.21,085 కోట్లు వసూలు చేస్తే రూ.14,439 కోట్లే బదిలీ చేశారు.**
- **సెస్సు రూపంలో చమురు పరిశ్రమలు 1974-75 నుంచి రూ.3,12,782 కోట్లు వసూలు చేస్తే దీనిలో రూ.902 కోట్లనే 'చమురు పరిశ్రమ అభివృద్ధి మండలి'కి బదలాయించారు. 1991-92 నుంచి 23-24 మధ్య ఎలాంటి మొత్తం ఇవ్వలేదు.**
- **సగటు రూ.845 కోట్ల నిల్వలు ఉన్న 10 రిజర్వు నిధులు, 21 డిపాజిట్ ఖాతాలను మూడేళ్లుగా వాడకుండా వదిలేశారు.**

## వృద్ధాశ్రమాలు కావు.. స్నేహాలయాలు



కేరళంలో ప్రభుత్వ, ప్రైవేటు నిర్వహణలో కొనసాగుతున్న వృద్ధాశ్రమాలను ఇకపై ఓల్డేజ్ హోమ్స్ అని కాకుండా.. 'స్నేహాలయాలు' అని పిలవనున్నారు. ఈ మేరకు రాష్ట్ర సామాజిక న్యాయశాఖ మంత్రి వి.ఇ.అబ్దుల్ గఫూర్ ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని ఆశ్రమాల బోర్డులను వెంటనే మార్చేసి, అధికారిక రికార్డుల్లోనూ అలాగే పేర్కొనాలని ఆదేశించారు. తిరువనంతపురం శివారులోని పూజప్పురావద్ద సామాజిక న్యాయ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓ ఆశ్రమాన్ని సందర్శించిన మంత్రి.. రాష్ట్ర మానవ హక్కుల కమిషను ఇటీవల జారీ చేసిన సూచనల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వయోవృద్ధులు ఆశ్రయం పొందుతున్న ఇటువంటి గృహాలను మరింత ప్రేమపూర్వకంగా, సురక్షితంగా, ఆనందదాయక ప్రదేశాలుగా మార్చేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.

## దినకూలీ సోదరులకు ఊరంతా ఒక్కటై స్వాగతం




ఛత్తీస్‌గఢ్‌లోని ధంతరీ జిల్లా దుధ్‌వారా అనే కుగ్రామానికి చెందిన అన్నదమ్ములు పవన్ నేతమ్, నకుల్ నేతమ్‌లకు గ్రామమంతా ఒక్కటై బాణసంచా, నృత్యాలతో ఘనస్వాగతం పలికింది. దినకూలీలుగా పనిచేసిన వీరిద్దరూ సీఆర్పీఎఫ్ శిక్షణ పూర్తి చేసుకొని గ్రామంలోకి వచ్చిన సందర్భంగా ఓపెన్‌టాప్ వాహనాల్లో ఊరేగిస్తూ ఇంటికి తీసుకొచ్చారు. యూనిఫాంతో పవన్, నకుల్‌లను చూసిన కుటుంబసభ్యులు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. భవన నిర్మాణ పనుల్లో పనిముట్లు పట్టిన వీరి చేతులు నేడు దేశ సమగ్రత కోసం ఆయుధాలు ధరించనున్నాయని గ్రామపెద్ద ద్రోణ్ గైక్వాడ్ వ్యాఖ్యానించారు.

## యువతి సాధ్వీగా మారేందుకు మధ్యప్రదేశ్ హైకోర్టు అనుమతి



మధ్యప్రదేశ్‌కు చెందిన 20 ఏళ్ల యువతి విషయంలో అక్కడి హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఐహిక సుఖమయ జీవితాన్ని వదిలేసి సాధ్వీగా మారేందుకు అంగీకరించింది. ఓ మేజర్‌గా తన జీవితానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం, నచ్చిన మతాన్ని ఆచరించే స్వేచ్ఛ ఆమెకు ఉందని పేర్కొంది. ఓ రిట్ పిటిషన్ విచారణ సందర్భంగా ఇందౌర్ బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసింది. జైన మత దీక్షను స్వీకరించి, సాధ్వీగా మారాలని తాను నిర్ణయించుకోగా.. తల్లిదండ్రులు, బంధువులు ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అడ్డుపడుతున్నారని ఆ యువతి హైకోర్టును ఆశ్రయించారు. పోలీసు రక్షణ కావాలని కోరారు. ఇందౌర్ బెంచ్‌లోని జస్టిస్ సందీప్ ఎన్.భట్ ఏకసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. యువతి తల్లిదండ్రులపై తమకు సానుభూతి ఉన్నప్పటికీ.. ఆమె మేజర్ అయినందున చట్టపరంగా రక్షణ పొందేందుకు పిటిషనరుకు అన్ని హక్కులూ ఉన్నాయని అభిప్రాయపడింది. ఈ మేరకు గతంలో పలు కేసుల్లో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించింది.

## కాంగ్రెస్‌తో 'వందేమాతరం' వివాదం.. స్పందించిన ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్‌లో ఇటీవల జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో జాతీయ గేయం 'వందేమాతరం'ను పూర్తిగా ఆలపించే విషయంలో కాంగ్రెస్ , నేషనల్ కాన్ఫరెన్స్ మధ్య మాటల యుద్ధం జరిగింది. ఈ విషయంపై తాజాగా జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందించారు.

'జాతీయ గేయానికి సంబంధించి ఇటీవల చట్టం చేసిన విషయం తెలిసిందే. అందులో అన్ని చరణాలు పాడడాన్ని తప్పనిసరి చేశారు. ఇది కేవలం జమ్మూకశ్మీర్‌కే కాదు. యావత్ దేశానికి వర్తిస్తుంది. ఈ నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. మా పార్టీ భావజాలానికి.. వందేమాతరానికి సంబంధం లేదు. అయినప్పటికీ దేశంలోని చట్టాలను మేం పాటిస్తాం. అలా కాకుండా చట్టాన్ని ఎదిరించి.. కశ్మీరీలు జైలులో ఉండాలని కాంగ్రెస్ కోరుకుంటోందా?' అని ఒమర్ అబ్దుల్లా ప్రశ్నించారు.

**అసలేమయ్యిందంటే..?**

శ్రీనగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పూర్తి వందేమాతరం ఆలపించే వరకు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా (, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా సహా అందరూ నిల్చొనే ఉన్నారు. పూర్తి వందేమాతరాన్ని ఆలపించడంపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిపై నేషనల్ కాన్ఫరెన్స్ స్పందిస్తూ.. ఇండియా కూటమి భాగస్వామిగా తమ మిత్రపక్షాలపై షరతులు విధించే అధికారం కాంగ్రెస్‌కు లేదని స్పష్టం చేసింది. దీంతో ఇరుపార్టీల మధ్య ఈ అంశం వివాదంగా మారింది.





## రవాణా వ్యవస్థల మధ్య సమన్వయం ఎలా?

భారతదేశం హైవేలు, విమానాశ్రయాలు, ఓడరేవులు, మెట్రో రైళ్ళు, గూడ్సు రైళ్ళు, హైస్పీడ్ రైళ్ళ వంటి రవాణా వ్యవస్థల నిర్మాణంలో ఇప్పటికే భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టింది. అయినప్పటికీ పౌరుల రోజువారీ ప్రయాణాలు సవ్యంగా సాగటం లేదు. భిన్న రవాణా వ్యవస్థల మధ్య సమన్వయం లేకపోవటంతో అవి వేటికవిగా పనిచేస్తున్నాయి. విమానాశ్రయంలో దిగిన ప్రయాణికుడు అక్కడి నుంచి మెట్రో సర్వీసులకు కనెక్ట్ కావడంలో ఇబ్బందిపడుతున్నాడు. మెట్రో రైలు ప్రయాణికుడు బస్ కనెక్టివిటీ విషయంలో ఇబ్బంది పడుతున్నాడు.

ఇప్పుడు భారతదేశం ముందున్న సవాలు కొత్త రవాణా వ్యవస్థలను సృష్టించడం కాదు, ఉన్న వాటిని ఏకీకరించడం. జాతీయ అభివృద్ధి తదుపరి దశలో వేర్వేరు రకాల రవాణా వ్యవస్థల మధ్య సమన్వయం కీలకమైన అంశం. దీనికి కోఆర్డినేటెడ్ ప్లానింగ్, యూనిఫైడ్ టికెటింగ్, సమాంతర షెడ్యూళ్లు, ఇంటెలిజెంట్ లాస్ట్–మైల్ కనెక్టివిటీలు కావాలి.

జాతీయ ఆర్థిక ఉత్పత్తిలో సుమారు మూడింట ఒక వంతు మన నగరాల నుంచే వస్తున్నది. ముంబై, హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ, చెన్నై, కలకత్తా, పూణే వంటి మెట్రోపాలిటన్ ప్రాంతాలు దేశ ఆర్థిక వృద్ధికి ఇంజన్లుగా ఉన్నాయి. అయితే రద్దీ, ప్రయాణ ఆలస్యాలు, ఇంధన వ్యయం, ఉత్పాదకత నష్టాలు ఆర్థిక వ్యవస్థపై భారాన్ని మోపుతున్నాయి.

ప్రధాన నగరాల్లో రద్దీ సమస్యల వల్ల కలిగే నష్టం ప్రతి ఏటా అనేక లక్షల కోట్ల రూపాయలకు చేరుతున్నది. పని గంటల నష్టం, పెరిగే ఖర్చులు, పర్యావరణానికి వాటిల్లే నష్టం, ఉత్పాదకత తగ్గడం– ఇవన్నీ కలిసి మనం మన రవాణా వ్యవస్థల మీద పెట్టిన పెట్టుబడుల ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయి. సమస్య పెట్టుబడుల కొరత కాదు, ఏ వ్యవస్థకు ఆ వ్యవస్థ పరస్పర సంబంధం లేకుండా విడిపోయి కొనసాగటం.

మన దేశంలో హైస్పీడ్ రైల్ కార్యక్రమం ఇప్పుడు ప్రకటనల దశ నుంచి అమలు దశకు చేరుకుంది. 2026–27 కేంద్ర బడ్జెట్ ఏడు కొత్త హైస్పీడ్ రైల్ కారిడార్లను ఆమోదించింది. ఇవి సుమారు నాలుగువేల కిలోమీటర్లు కవర్ చేస్తాయి. రైల్వే మంత్రిత్వశాఖ అంచనా ప్రకారం అవసరమయ్యే మొత్తం పెట్టుబడి సుమారు రూ.16లక్షల కోట్లు. వారణాసి–సిలిగురి లైను మినహా మిగిలిన అన్ని కారిడార్లకు నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ వివరంగా ప్రాజెక్ట్ రిపోర్టులు (డీపీఆర్) పూర్తి చేసింది.

తెలంగాణకు ప్రత్యేకంగా హైదరాబాద్– కేంద్రిక కారిడార్లు ముఖ్యం. ముంబై–హైదరాబాద్ లైన్ (711 కి.మీ.) డీపీఆర్ పూర్తయ్యింది. కర్ణాటకలో కలబురగి కీలక హబ్‌గా ఎదుగుతోంది. హైదరాబాద్–బెంగళూరు (618 కి.మీ.), హైదరాబాద్–చెన్నై (744 కి.మీ.) కారిడార్లు సర్వే, రీఅలైన్‌మెంట్ దశల్లో ఉన్నాయి. ఫ్యూచర్ సిటీ, డ్రై పోర్టు, వికారాబాద్, కోకాపేట, శంషాబాద్ వద్ద కొత్త స్టేషన్లను ప్రతిపాదించారు.

ముంబై–హైదరాబాద్–బెంగళూరు కారిడార్ భారతదేశ అత్యంత ముఖ్యమైన ఆర్థిక ప్రాంతాల్లో ఒకటిగా ఎదుగుతోంది. ఫైనాన్స్, టెక్నాలజీ, ఫార్మా స్యూటికల్స్, మాన్యుఫాక్చరింగ్, లాజిస్టిక్స్, ఏరోస్పేస్, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌స్‌ను ఈ కారిడార్ కలుపుతోంది. ఈ మెట్రోపాలిటన్ ప్రాంతాలు మూడూ కలిపి ఏటా రూ.70లక్షల కోట్లకు మించిన ఆర్థిక కార్యకలాపాలు చేస్తున్నాయి.

విమానాశ్రయాలు, రైల్వేలు, హైస్పీడ్ రైళ్ళు, మెట్రో రైళ్ళు, రాష్ట్ర రవాణా యూనిట్లు, ప్రైవేట్ వాహన సర్వీసులు... వీటన్నిటినీ ఒక ఉమ్మడి చట్రం కిందకు తీసుకువచ్చి 'మల్టీ–మోడల్ ట్రాన్సిట్ కన్సార్టియం' (ఎమ్ఎమ్‌టీసీ)ను ఏర్పాటు చేయాలి. ఇంటిగ్రేటెడ్ ప్లానింగ్, కామన్ ప్యాసింజర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, యూనిఫైడ్ టికెటింగ్, కోఆర్డినేటెడ్ షెడ్యూలింగ్, షేర్డ్ మొబిలిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం ఈ ప్లాట్‌ఫాం ఏర్పాటు అవసరం. దీన్ని నడిపించాల్సిన మార్గదర్శక సూత్రం: ఒక ప్రయాణికుడు, ఒక టికెట్, ఒక ప్రయాణం, అనేక రవాణా పద్ధతులు .

నీతి ఆయోగ్ ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ సమీక్షలో 5–10శాతం మెట్రో కారిడార్ల పెట్టుబడిని బస్సులు, వాటర్ ట్రాన్స్‌పోర్ట్ వంటి నాన్–మెట్రో పబ్లిక్ ట్రాన్స్‌పోర్టుకు మళ్లించాలని సూచించింది. దీనినే మల్టీ మోడల్ ట్రాన్సిట్ కన్సార్టియం కింద జాతీయ స్థాయిలో అమలు చేయవచ్చు. ఎమ్ఎమ్‌టీసీ స్వతంత్ర వ్యవస్థగా విడిగా పనిచేయదు. ఇప్పటికే ఉనికిలో ఉన్న ఇండియన్ రైల్వేస్, హైస్పీడ్ రైల్, మెట్రో కార్పొరేషన్లు, పీఎమ్ గతిశక్తి ప్రాజెక్టులన్నిటి మధ్య కోఆర్డినేట్ చేస్తూ, ఒక ఇంటిగ్రేషన్ లేయర్‌గా పనిచేస్తుంది.

ఈ విధానంలో ప్రజలు రైలు, హైస్పీడ్ రైలు, మెట్రో, బస్సులు, విమానాశ్రయాల సేవలను ఒకే యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా పొందగలుగుతారు. వారు అక్కడే పలు రవాణా సదుపాయాల మధ్య తమ ప్రయాణాన్ని ప్లాన్ చేసుకుని, బుక్ చేసుకుని, ధర చెల్లిస్తారు. మున్ముందు పాలకులు కొత్త రవాణా వ్యవస్థల కల్పన కంటే, ఇప్పటికే ఉనికిలో ఉన్న పలు రవాణా వ్యవస్థల మధ్య జాతీయ స్థాయిలో సమన్వయం సాధించే వ్యవస్థలను రూపొందించటం గురించే ముఖ్యంగా ఆలోచించాలి.



# మాతృభాషపై నిర్లక్ష్యమా?!

**నేడు రాష్ట్రంలో చాలామంది పిల్లలు తెలుగు మాట్లాడుతున్నారు కానీ, చదవలేరు, రాయలేరు. పుట్టినప్పటి నుంచి అమ్మ మాట వింటూ, అమ్మ భాష మాట్లాడుతూ పెరిగిన విద్యార్థులు చదువులో మాత్రం మాతృ భాష తెలుగును పక్కన పెడుతున్నారు. ఇంటర్మీడియట్‌లో ఎక్కువ మార్కులు సాధించాలన్న ఉద్దేశంతో చాలామంది తల్లిదండ్రులు, విద్యాసంస్థలవారు కూడా విద్యార్థులను తెలుగుకు బదులుగా సంస్కృతం లేదా ఇతర భాషలను రెండో భాషగా ఎంచుకొమ్మని ప్రోత్సహిస్తున్నారు.తెలుగును రెండో భాషగా తీసుకుంటే పరీక్షలో బాగా రాసినా కూడా తక్కువ మార్కులే వస్తాయనీ, అదే సంస్కృతాన్ని ఎంచుకుంటే ఎక్కువ మార్కులు వస్తాయనీ విద్యార్థులు భావిస్తున్నారు. ఇది విద్యార్థుల తప్పు కాదు. తల్లిదండ్రుల తప్పు అని కూడా అనలేము. ఈ విషయంలో మనం మొత్తం విద్యా వ్యవస్థ తీరుపైనే పునరాలోచించాల్సిన అవసరం ఉంది. ఇంటర్మీడియట్‌లో సెకండ్ లాంగ్వేజ్ ఆప్షన్ తెలుగు లేకుండా చేయడం వల్ల ఈ పరిస్థితి వచ్చింది.**




ఆంధ్రప్రదేశ్‌లో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి పదో తరగతి ఫలితాలను చూస్తే తెలుగు భాషలో విద్యార్థులు ఎంతగా వెనుకబడిపోతున్నారన్నది తెలుస్తుంది. మొత్తం 6,17,827 మంది పరీక్ష రాస్తే.. ఫెయిల్ అయిన విద్యార్థులు 91,150 మంది. ఇందులో తెలుగులో ఫెయిల్ అయిన విద్యార్థులు 37,679. మరోపక్క ఇంగ్లీష్‌లో 8,771 మంది, హిందీలో 1,436 మంది మాత్రమే ఫెయిలయ్యారు. విద్యార్థులు మాతృభాషలోనే వెనుకబడుతున్నారంటే, అది కేవలం విద్యార్థుల సమస్య కాదు. తెలుగు ప్రశ్న పత్రాలు రూపుదిద్దే, మూల్యాంకనం చేసే సరళినే మార్చాల్సిన అవసరం ఉంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ మూల్యాంకన మార్గదర్శకాల ప్రకారం సంస్కృత ప్రశ్నలకు తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో సమాధానాలు రాసే అవకాశం ఉండటంతో 100కి 99 మార్కులు సాధించడం సులభమవుతోందన్న అభిప్రాయం విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉంది. 90శాతం ప్రైవేట్ కళాశాలలు తెలుగును ఒక ద్వితీయ భాషగా అందించడం లేదు. ఇది మారాలి. పదో తరగతి వరకు అన్ని బోర్డుల్లో తెలుగును తప్పనిసరిగా బోధించినప్పుడు, ఇంటర్మీడియట్ స్థాయిలో సంస్కృతానికి ఇంత ప్రాధాన్యం ఎందుకు? ఇంటర్‌లో రెండో భాషగా తెలుగు, హిందీ, ఉర్దూ వంటి భాషలను ఎంచుకునే విద్యార్థులకు ఒక విధమైన మార్కుల విధానం, సంస్కృతం ఎంచుకునే విద్యార్థులకు మరో విధమైన ప్రయోజనం ఉండటం ఎందుకు?

అలాగే తెలుగు భాషకు మూల్యాంకనం కూడా కఠినంగా ఉందన్న అభిప్రాయం ఉంది. పేపర్ దిద్దే సమయంలో అక్షరదోషాలు, వ్యాకరణ దోషాలు, వాక్య నిర్మాణం వంటి అంశాలపై కఠినంగా ఉండటం వల్ల విద్యార్థులు మార్కులు కోల్పోయే పరిస్థితి ఉంది. అందువల్ల తెలుగులో 80-85 మార్కుల కంటే ఎక్కువ సాధించడం విద్యార్థులకు కష్టంగా మారుతోంది. దీనిని కూడా మనం తక్షణమే సమీక్షించాలి. విద్యార్థులు, తల్లిదండ్రుల మనసుల్లో "తెలుగు చదివితే భవిష్యత్తుకు నష్టం ఉండదు" అన్న నమ్మకాన్ని మన విద్యా వ్యవస్థ కల్పించాలి. ప్రస్తుతం ఇంటర్మీడియట్‌లో సాధించే మార్కులు AP EAPCET వంటి ప్రవేశ పరీక్షల అవకాశాలను ప్రభావితం చేస్తున్నాయి. JEE Main/ Advanced ప్రవేశానికి 75శాతం ఇంటర్మీడియట్ మార్కులు అర్హతగా ఉన్నాయి. ఇంటర్మీడియట్‌లో సాధించే మార్కులు, రాబోయే కాలంలో NEET వంటి ప్రవేశ పరీక్షల ర్యాంకులను కూడా ప్రభావితం చేయవచ్చు.

ఇలాంటి పరిస్థితిలో తెలుగును రెండో భాషగా తీసుకుని 20-30 మార్కులు కోల్పోవటానికి విద్యార్థులు సిద్ధంగా ఉండరు. అందుకే తెలుగుకు బదులుగా సంస్కృతం తీసుకుంటున్నారు. భాష ఏదైనా నేర్చుకోవచ్చు. సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్... అన్నీ అవసరమే. కానీ మార్కుల కోసం మాతృభాషను వదులుకోవాల్సిన పరిస్థితి మాత్రం రాకూడదు. మాతృభాషను ఎంచుకున్నా విద్యార్థులు మార్కులు కోల్పోని విద్యా వ్యవస్థ మనకు కావాలి. తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన మన రాష్ట్రంలో తెలుగు మృత భాషగా మారకుండా కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.

మెగా డీఎస్సీ, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర, మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్స్, స్మార్ట్ క్లాస్ రూమ్స్... ఇలా విద్యారంగ పరిధిలో ఎన్నో సంస్కరణలను తీసుకువచ్చిన మంత్రి నారా లోకేశ్ తెలుగు భాష విషయంలో కూడా అభివృద్ధిని సాధించగలరు. ప్రభుత్వం ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలి. తెలుగు, సంస్కృతం, హిందీ వంటి అన్ని భాషలకు న్యాయమైన, సమానమైన మార్కుల విధానం ఉండేలా ప్రస్తుత విద్యా విధానాన్ని సమీక్షించాలి. తెలుగు ప్రశ్న పత్రాన్ని, తెలుగు సిలబస్‌ను కూడా పునఃపరిశీలించాలి. ప్రస్తుత కాలానికి అనుగుణంగా, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా తెలుగు బోధన ఉండాలి. తెలుగును కాపాడేందుకు తెలుగులో కూడా 99 మార్కులు వచ్చే విధంగా ప్రశ్నపత్రాల అమరికను మార్చాలి. తెలుగు ఉపాధ్యాయులను కూడా ఈ సంస్కరణల్లో భాగస్వాములను చేయాలి. విద్యార్థి మాతృభాషను ఎంచుకున్నా అతని ప్రతిభకు న్యాయం జరిగేలా మన విద్యా వ్యవస్థ ఉండాలి.

# 'పీఓకే' పాకిస్థాన్ చేజారుతోందా?

**ఇంతకాలం తమను పాకిస్థానీయులుగా భావించుకుంటూ, భారతీయ హోదా ఎన్నటికీ అంగీకరించబోమని చెబుతూ వస్తున్న పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రజానీకం నేడు పాకిస్థాన్ చెర నుంచి విముక్తం కావాలని ఆందోళన బాట పట్టడం ఓ గొప్ప చరిత్రాత్మక పరిణామం. గత కొంతకాలంగా పీఓకేలోని ప్రజలు తీవ్రమైన ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటున్నారు. బియ్యం, గోధుమలు, నూనెలు, పప్పుధాన్యాలు వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పెట్రోల్ ధరలు మండిపోతున్నాయి. అధిక ధరలు, నిరుద్యోగం తదితర సమస్యలతో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 45 లక్షల మంది సతమతమవుతున్నారు.భారత భూభాగం నుంచి ఆక్రమించుకున్న ఈ ప్రాంతాన్ని పాకిస్థాన్ 'ఆజాద్ కశ్మీర్'గా పిలుచుకుంటోంది. ఈ ప్రాంతానికి ప్రజలు ఎన్నుకునే ప్రధానమంత్రి, అధ్యక్షుడు, శాసన వ్యవస్థ, సొంత అధికారిక జెండా మొదలైనవి ఉన్నప్పటికీ పాలనాధికారాలన్నీ పాకిస్థాన్ ప్రభువుల చేతుల్లోనే ఉంటాయి.**




భారత్‌ను బూచిగా చూపిస్తూ ఇన్నాళ్లూ పాక్ పాలకులు పీఓకే ప్రజలను తమకు అనుకూలంగా మార్చుకున్నారు. అయితే పాక్ కారణంగా అనేక ఏళ్లుగా పీఓకేలో అభివృద్ధి నిలిచిపోయింది. ప్రజలకు స్వేచ్ఛ లేదు. ఉగ్రవాద కార్యకలాపాలు ఒక్కటే అక్కడ పెరిగాయి. పీఓకేను చెప్పు చేతల్లో పెట్టుకున్న పాకిస్థాన్‌ను దారుణమైన ఆర్థిక సంక్షోభం వెంటాడుతోంది. మరోవైపు భారత్‌లో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయి. ముఖ్యంగా జమ్మూ కశ్మీర్ క్రమంగా పూర్వస్థితికి చేరుకుంటోంది. కశ్మీర్ లోయలో ఉగ్రవాద కార్యకలాపాలు బాగా తగ్గిపోయాయి. కాశ్మీరీ పండిట్లకు స్థానిక ముస్లిం ప్రజలు సాదర ఆహ్వానం పలుకుతున్నారు. పర్యాటక రంగం గణనీయంగా కోలుకుంది. జమ్మూ కశ్మీర్‌కు చెందిన క్రీడాకారులు దేశం తరఫున వివిధ క్రీడలలో అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో అంతర్జాతీయ సమాజానికి గొప్ప సంకేతం ఇచ్చినట్లయింది.

అంతర్జాతీయ పరిణామాలు.. ముఖ్యంగా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, తాజాగా ఇరాన్-ఇజ్రాయెల్, అమెరికాల మధ్య సాగుతున్న భీకరపోరు కారణంగా అనేక దేశాలలో వాణిజ్యం, ఎగుమతి దిగుమతులు నిలిచిపోయి అవి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. అయితే, 145 కోట్ల జనాభా కలిగిన భారత్ మాత్రం కొద్దిపాటి ఒడుదుడుకులు మినహా దృఢంగా, నిబ్బరంగా నిలబడగలుగుతోంది. శాస్త్ర సాంకేతిక రంగాలలో, ఆహార భద్రతలో భారత్ ప్రపంచ దేశాలలో మొదటి పది స్థానాలలో ఒకటిగా నిలబడగలిగింది.

దివాళా అంచున నిలబడిన పాకిస్థాన్ గత ఏడు దశాబ్దాలకు పైగా తన నియంత్రణలో ఉంచుకున్న పీఓకేపై పట్టు కోల్పోతున్న సూచనలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఆ ప్రాంతంలో ప్రస్తుతం పెద్ద ఎత్తున ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు హోరెత్తుతున్నాయి. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ), స్థానిక రాజకీయ పార్టీలు, సంస్థలతో ఏర్పడిన ఐక్య కార్యాచరణ సమితి వంటివి.. ప్రభుత్వ వైఫల్యాలను ముఖ్యంగా అదుపుతప్పిన ధరలు, ఆహారం, విద్యుత్ కొరతలను నిరసిస్తూ వీధుల్లోకి వచ్చి ఆందోళన చేస్తున్నాయి.

ఆశ్చర్యం ఏమంటే, జేఏఏసీ చేపట్టిన ఈ ఆందోళన కార్యక్రమాలలో పాల్గొంటున్న ప్రజలు 'పీఓకే పాకిస్థాన్‌లో భాగం కాదు' అనే నినాదాలు చేస్తున్నారు. తమ ప్రాంతంలో అనేక దశాబ్దాలుగా కొనసాగుతున్న పాకిస్థానీ ఉన్నత వర్గాల ప్రత్యేక హక్కులను, సదుపాయాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పీఓకేలో సాగుతున్న ఆందోళనను బలప్రయోగంతో అణచివేయాలని పాక్ పాలకులు చూస్తున్నారు. అత్యంత అమానవీయంగా పాకిస్థాన్ భద్రతా దళాలు పీఓకే ప్రాంతంలో ప్రసార మాధ్యమాలను నియంత్రిస్తున్నాయి. ఇంటర్‌నెట్ సౌకర్యం లేకుండా చేశాయి. పైగా, ప్రజలకు నిత్యావసర సరుకులు, వైద్య సామగ్రిని సైతం నిలిపివేయడం అంతర్జాతీయ సమాజాన్ని నివ్వెరపరుస్తోంది. పీఓకేలోని ప్రజలను పాకిస్థాన్ తమ సొంత పౌరులుగా భావించేటట్లయితే ఆర్థిక దిగ్బంధనాలు ఎలా విధిస్తారని అక్కడి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తమను ద్వితీయశ్రేణి పౌరులుగా పరిగణించే ఇటువంటి వైఖరి కారణంగానే.. స్వతంత్ర పౌరులుగానో లేదా కశ్మీరీ పౌరులుగానో తమను గుర్తించాలని కోరుతున్నామని పీఓకేలోని మెజారిటీ ప్రజలు వాదిస్తున్నారు.

పాక్ ఆక్రమిత కశ్మీర్ తమ దేశంలో అంతర్భాగమని భారత్ మొదటి నుంచి వాదిస్తూనే ఉంది. ఈ కారణంతోనే పీఓకేను పాకిస్థాన్ చిత్రపటంలో భాగంగా చూపించదు. పైగా జమ్మూ కశ్మీర్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో కూడా రాష్ట్ర శాసనసభలో 24 అసెంబ్లీ స్థానాలను పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌కు కేటాయించారు. ఈ ప్రాంతంపై భారతదేశానికి ఉన్న చిరకాల రాజ్యాంగ హక్కును, శాసనహక్కును నొక్కి చెప్పేందుకే ఈ స్థానాలను గతంలో లాగా ఖాళీగా ఉంచి రిజర్వ్ చేశారు. అంటే ఈ ప్రాంతం భారత్ పరిపాలనలోకి వస్తే పీఓకే ప్రాంతంలో డీలిమిటేషన్ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం అధికారికంగా నిర్వహిస్తుంది. అందుకు సంబంధించి చేసిన చట్టంలో పలు నిబంధనలు చేర్చారు.

పీఓకేను సైనిక చర్య ద్వారా స్వాధీనం చేసుకునే సామర్థ్యం భారతదేశానికి లేకపోలేదు. కానీ బలవంతపు విలీనం భారత్‌కు ఇష్టం లేదు. ప్రత్యక్ష సైనిక దాడికి బదులుగా దౌత్యపరమైన ప్రక్రియతోను, స్థానిక ప్రజల అభీష్టం మేరకే ఈ అంశాన్ని పరిష్కరించాలని భారత్ భావిస్తోంది. జమ్మూ కశ్మీర్‌లో ప్రస్తుతం జరుగుతున్న ఆర్థిక సామాజిక అభివృద్ధి కారణంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ చివరకు స్వచ్ఛందంగా భారత్‌లో విలీనం కోరవచ్చని ఇటీవల కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టం చేశారు. ఆక్రమిత భూభాగంలో పౌర అశాంతి కారణంగా విలీనం చేసుకుంటే కొన్ని సమస్యలు ఎదురవుతాయన్న వాస్తవం భారత్‌కు తెలుసు. పీఓకే అంశంపై ఇప్పటికే భారత్... ఐక్యరాజ్య సమితికి ఫిర్యాదు చేసి, న్యాయం కోసం దౌత్యపరమైన ఒత్తిడి తెస్తోంది. అలాగే దాదాపు 45 లక్షల సంఖ్యలో ఉన్న జనాభాను నిర్వహించడమనేది, వారి పూర్తి అంగీకారం లేకుండా సజావుగా జరిగే పని కాదు.

ఓకేను వదులుకోవడం మొదటి నుంచి పాకిస్థాన్‌కు ఇష్టం లేదు. అనుకూలమైన భౌగోళిక పరిస్థితుల కారణంగా అక్కడి నుంచి తమ మిలిటెంట్లను భారత భూభాగంలోకి పంపడం వారికి తేలిక కనుక ఎట్టి పరిస్థితులలోనూ పీఓకేను వదులుకోవడానికి పాకిస్థాన్ సిద్ధంగా లేదు. ఈ కారణంగానే, ఒకవైపు పీఓకేలో తిరుగుబాటును సైనిక చర్య ద్వారా అణచివేస్తూ, మరోవైపు ఇతర ఇస్లామిక్ దేశాల మద్దతు కోరుతోంది. అంతేకాకుండా చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ పీఓకే భూభాగంతో అనుసంధానమై ఉన్నందున.. పీఓకే విషయంలో భారత్ ఏ మాత్రం తొందరపడినా చైనా జోక్యం తప్పదని పాకిస్థాన్ నమ్ముతోంది.

పీఓకేలో ప్రస్తుతం సాగుతున్న ఆందోళనలు పరాకాష్ఠకు చేరితే వాటిని నియంత్రించడం పాకిస్థాన్‌కు సాధ్యం కాదు. ప్రస్తుతం దేశ అంతర్గత సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్‌కు పీఓకే పెద్ద తలనొప్పిగా తయారైంది. అంతర్జాతీయ సమాజంలో పాకిస్థాన్ ప్రతిష్ఠ నానాటికీ దిగజారిపోతోంది. పొరుగున తాలిబన్ల ఆధీనంలో ఉన్న అఫ్ఘానిస్థాన్‌తో కూడా పాకిస్థాన్ సఖ్యతగా లేదు. బంగ్లాదేశ్‌లోని కొత్త ప్రభుత్వంతో అనుకూలంగా ఉంటున్నప్పటికీ పాకిస్థాన్‌కు అక్కడి మెజారిటీ ప్రజల మద్దతు లేదు. చైనా ఒక్కటే వివిధ స్వప్రయోజనాల రీత్యా పాక్‌కు ఆపన్న హస్తం అందిస్తోంది.

ఇప్పటికిప్పుడు పీఓకే భారత్‌లో విలీనం అవుతుందని భావించలేము. పీఓకేను బలవంతంగా స్వాధీనం చేసుకొనే అవకాశం కూడా లేదు. ఒకవేళ భవిష్యత్తులో పీఓకే కనుక భారత్‌లో విలీనం అయితే తప్పనిసరిగా భారత్‌కు అనేక ప్రయోజనాలు ఒనగూరుతాయి. ప్రత్యేకించి వ్యూహాత్మక, ఆర్థిక, భద్రత, ప్రయోజనాలు కలిగే అవకాశం ఉంది. మధ్య ఆసియా దేశాలకు భూమార్గం సుగమం కావడం, పాకిస్థాన్ నుంచి వచ్చే చొరబాటుదార్లను నిరోధించడం సాధ్యపడతాయి. ప్రధానంగా పాక్-చైనాల ఎకనామిక్ కారిడార్ పనులు నిలిచిపోయి పాకిస్థాన్ ఆర్థికంగా, రాజకీయంగా మరింత బలహీనపడుతుంది.

ప్రస్తుతం యావత్ ప్రపంచ దృష్టి ఇరాన్-అమెరికా యుద్ధంపైనే ఉండటం వల్ల పీఓకేలో వేగంగా చోటు చేసుకుంటున్న పరిణామాలు అంతర్జాతీయ సమాజం దృష్టిని పెద్దగా ఆకర్షించడం లేదు. అయితే, ఇటీవల జెనీవాలో పీఓకే మద్దతుదారులు నిర్వహించిన భారీ ప్రదర్శనతో పీఓకేలో జరుగుతున్న మానవహక్కుల హననంపై యునైటెడ్ నేషన్స్ దృష్టి సారించింది. జమ్మూ కశ్మీర్ అంశంలో నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న కొన్ని అసాధారణ నిర్ణయాలు ప్రస్తుతం సానుకూల పరిస్థితులను ఏర్పరిచాయి. జమ్మూ కశ్మీర్‌లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు, సంపద పెరిగి స్థూల రాష్ట్ర ఉత్పత్తి పెరిగింది. అన్నిటికంటే ముఖ్యంగా అక్కడ ప్రశాంత వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజల జీవన ప్రమాణాలు పెరగడంతో సహజంగానే పీఓకే ప్రజలు జమ్మూ కశ్మీర్‌లో అంతర్భాగం కావాలని భావిస్తున్నారు. మెజారిటీ ప్రజల మద్దతు కోల్పోయిన తర్వాత పీఓకేలో పాకిస్థాన్ పట్టు ఎంతోకాలం నిలబడదు. అయితే అదెంత కాలం అన్నదే ప్రశ్న?

# దేశ భవితకే గొడ్డలిపెట్టు!

**మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని మనం ఈ వేడుకలను జరుపుకొంటున్నాం. కానీ, 'నేను మరణించినప్పుడు మిగిలిన ప్రపంచమంతా దుఃఖిస్తుంది. భారతీయులు మాత్రం నాకోసం ఒక్క కన్నీటిచుక్క రాల్చరు' అంటూ ఆయన చివరి దశలో ఎందుకు బాధపడాల్సి వచ్చిందో ఆలోచించం! ఒకటి రెండింటిని తప్ప మిగిలిన ఆటలను పట్టించుకోకపోవడం, మొత్తంగా క్రీడాసంస్కృతినే ఛీత్కరించడం వంటివి జాతి ముద్దుబిడ్డల ఆవేదనకు కారణం కావడమే కాదు- దేశ భవిష్యత్తుకే గొడ్డలిపెట్టుగా పరిణమిస్తున్నాయి. 'చక్కగా చదువుకోకుండా ఆటలెందుకు దండగ' అంటూ పెద్దలు తొక్కే చిందులు- నవతరం ఆరోగ్యాన్ని గుల్లబారుస్తున్నాయి. ఇండియా డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ నివేదిక ప్రకారం, చిన్నారుల్లో చక్కెర స్థాయులు అసాధారణంగా పెరుగుతున్నాయి. ప్రతి అయిదుగురు భారతీయ కౌమార బాలల్లో ఒకరు మధుమేహం ముప్పు ముంగిట్లో ఉన్నారంటున్న ఇతర అధ్యయనాలు- కన్నవారికి కన్నులపండువగా ఎదిగివచ్చి 'వికసిత్ భారత్' లక్ష్యాల సాధనకు చోదకశక్తి కావాల్సిన యువత భవితకు సంబంధించి ఆందోళనకర చిత్రాన్ని ఆవిష్కరిస్తున్నాయి!**

దేశవ్యాప్తంగా 519ఏళ్ల వారిలో 4.1 కోట్ల మంది స్థూలకాయం బారినపడ్డారు. పోషకాల్లేని చిరుతిండ్లను మానిపించి, పిల్లలను మైదానాలకు పంపకపోతే రాబోయే రోజుల్లో ఊబకాయుల సంఖ్య ఇంకా ఎక్కువవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. స్థూలకాయం కారణంగా ఇండియా ఇప్పటికే ఏడాదికి రెండున్నర లక్షల కోట్ల రూపాయలను కోల్పోతోంది. అధిక బరువుతో ముసురుకునే వ్యాధుల చికిత్స, ఔషధాలకు అయ్యే ఖర్చులతోపాటు ఉత్పాదకత నష్టాలు, అర్ధాంతర మరణాల కారణంగానే జనభారతం ఇంత సంపదను చేజార్చుకుంటోంది. కుటుంబాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వాల స్థాయిల్లో సరైన సమగ్ర విధానాలను అనుసరించకపోతే 2060 నాటికి స్థూలకాయం ధాటికి దేశం రూ.72లక్షల కోట్లను నష్టపోవాల్సి రావొచ్చునని కొన్ని పరిశోధనలు అంచనా వేస్తున్నాయి. బట్టీ చదువుల మత్తులోపడి పిల్లలను ఆటపాటలకు దూరంచేస్తున్న సమాజంలో ఈ హెచ్చరికలన్నీ అరణ్యరోదనమే అవుతున్నాయి. తల్లిదండ్రుల మితిమీరిన గారాబం వల్ల జంక్‌ఫుడ్‌ను ఆబగా ఆరగిస్తూ గంటల తరబడి డిజిటల్ తెరలకు అతుక్కుపోతున్న చిన్నారుల్లోనైతే శారీరకంగా మానసికంగా లెక్కకుమిక్కిలి సమస్యలెన్నో ముమ్మరిస్తున్నాయి! దేశీయంగా దాదాపు కోటిన్నర బడుల్లో 24కోట్ల మందికి పైగా పిల్లలు చదువుకుంటున్నారు. పది పన్నెండేళ్ల పాఠశాల జీవితంలో వారు కనీసం 12వేల గంటల పాటు విద్యాలయాల్లోనే గడుపుతారు. దీర్ఘకాలంలో వ్యక్తి శ్రేయస్సుపై ప్రభావం చూపే అలవాట్లు పాదుకునే కీలక సమయమిదే. కాబట్టి ప్రతి విద్యార్థికీ ప్రామాణిక పోషకాహార, ఆరోగ్య కార్డును రూపొందించాలని ఐసీఎంఆర్, ఎన్ఐఎన్, యూనిసెఫ్‌ల సంయుక్త నివేదిక ఇటీవల ప్రభుత్వాలకు సూచించింది. పిల్లలు ఏం తింటున్నారు, ఎంతసేపు వ్యాయామం చేస్తున్నారు, ఎదుగుదల ఎలా ఉంది తదితర అంశాలను నిత్యం గమనిస్తూ ఆ కార్డులో పొందుపరచాలని పేర్కొంది. విపరీతంగా కొవ్వు, చక్కెర, ఉప్పు కలిగిన చిరుతిండ్ల ప్రకటనలను, 18ఏళ్ల లోపువారికి వాటి విక్రయాలను నిషేధించాలని సిఫార్సుచేసింది. ఇలాంటి జంక్‌ఫుడ్‌ను పాఠశాలల ప్రాంగణాల్లో, బడులకు యాభై మీటర్ల పరిధిలో అమ్మకూడదంటూ రాజస్థాన్ హైకోర్టు తాజాగా ఉత్తర్వులిచ్చింది. భావితరాల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ప్రభుత్వాలూ ఈ కోణంలో ఆలోచించాలి. వ్యాయామ విద్యకు ప్రాధాన్యమిస్తూ, అన్ని చోట్లా మైదానాలూ ఆట వస్తువుల ఏర్పాటుకు శ్రద్ధ వహించాలి!

# ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పెంపు

హైదరాబాద్, సెప్టెంబర్ 11, అనంత జనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ప్రభుత్వ ఉద్యోగుల కరవు భత్యం (డీఏ) ను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం.. ఇప్పటివరకు అమల్లో ఉన్న డీఏ శాతాన్ని మరింత పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏను ప్రస్తుతమున్న 37.31 శాతం నుంచి 40.04 శాతానికి పెంచుతూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీనివల్ల ఉద్యోగులకు అదనంగా 2.73 శాతం డీఏ పెంపు లభించినట్లయింది. ఈ పెంపును 2024 జూలై 1 నుంచి అమల్లోకి తీసుకువస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఈ డీఏ పెంపు లబ్ధి కేవలం సాధారణ ప్రభుత్వ ఉద్యోగులకే కాకుండా మరికొన్ని వర్గాల వారికి కూడా వర్తించనుంది. ప్రధానంగా 2022 రివైజ్డ్ పే స్కేల్స్ (వేతన సవరణ) ప్రకారం వేతనాలు పొందుతున్న ఉద్యోగులందరికీ ఈ డీఏ పెంపు వర్తిస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. అలాగే.. జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు తదితర స్థానిక సంస్థల ఉద్యోగులకు కూడా ఈ పెంపు వర్తిస్తుంది. ఇవే కాకుండా ఎయిడెడ్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి, అలాగే రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల (యూనివర్సిటీల) బోధన, బోధనేతర సిబ్బందికి కూడా ఈ డీఏ పెంపు వర్తిస్తుందని ఆర్థిక శాఖ జారీ చేసిన ఉత్తర్వులలో స్పష్టం చేశారు. ఈ తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి ఆర్థికంగా ప్రయోజనం చేకూరనుంది.

# త్రిప్రయార్ శ్రీ రామస్వామి వారిని దర్శించుకున్న పవన్ కళ్యాణ్

- ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి స్వామి వారికి ప్రత్యేక పూజలు
- శ్రీకృష్ణునికి, శ్రీరామ స్వామి, అయ్యప్పస్వామి వారికి పట్టు వస్త్రాల సమర్పణ
- దీపాలంకరణ, మీనుట్టు, వేది వజిపాడు సేవల్లో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రివర్యులు

కేరళం సెప్టెంబర్ 11 అనంత జనశక్తి న్యూస్



సుప్రసిద్ధ శ్రీరామ క్షేత్రం, నాలాంబలం యాత్రలో విఖ్యాతిగాంచిన క్షేత్రాల్లో ఒకటిగా పేరు పొందిన కేరళం రాష్ట్రంలోని త్రిప్రయార్ శ్రీ రామస్వామి వారిని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ దర్శించుకున్నారు. శుక్రవారం సాయంత్రం ఆలయంలో విశిష్ట సేవల్లో ఒకటిగా పేరున్న దీపారాధన సేవలో పాల్గొన్నారు. ఒక్క రోజు దీపారాధన సేవకు విరాళం అందించి, స్వయంగా దీపాలు వెలిగించి సేవలో పాల్గొన్నారు. ఆలయం ప్రధాన ద్వారం ఎదురుగా, శ్రీకృష్ణ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రధాన దీపాల్లో జ్యోతి ప్రజ్వలన గావించారు. దీపారాధనతోపాటు ఆలయ సంప్రదాయాలను అనుసరించి మీనుట్టు, వేది వజిపాడు సేవల్లోనూ పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. శంఖుచక్రాలతోపాటు ధనుస్సు, హారం ధరించిన శ్రీ రామస్వామి వారి అద్భుత రూపాన్ని దర్శించి, సంధ్యాకాల అర్చనలు నిర్వహించారు. శ్రీరామ స్వామి వారితో పాటు ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీకృష్ణునికి, అయ్యప్ప స్వామికి పట్టు వస్త్రాల సమర్పించారు. అనంతరం గర్భాలయంలో మూలవిరాట్టుకి కుడివైపు ఉన్న దక్షిణా మూర్తికి, నైరుతి దిక్కున ఉన్న వినాయకుడికి, అనంతపద్మనాభ స్వామి వారి శయన రూపానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మేల్ శాంతి(ప్రధాన అర్చకులు) శ్రీ రామన్ తిరుమేని గారు పూజ అనంతరం పవన్ కళ్యాణ్ కి తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనాలు అందించారు. అంతకు ముందు శ్రీరామ స్వామి క్షేత్రానికి విచ్చేసిన శ్రీ పవన్ కళ్యాణ్ కి కొచ్చిన దేవస్థానం బోర్డు ఛైర్మన్, శ్రీరామ స్వామి ఆలయ కమిటీ, దేవాదాయ శాఖ కమిషనర్, ఆలయ అడ్మినిస్ట్రేటర్, అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తీర్వా నదిలో చేపలకి ఆహారం..

వేది వజిపాడు సేవకు విరాళం

శ్రీరామ స్వామి వారి దర్శనానికి ముందు ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి అదే ప్రాంగణంలో ఉత్తర దిక్కున ఉన్న శ్రీకృష్ణుని శ్రీ పవన్ కళ్యాణ్ దర్శించుకున్నారు. అనంతరం మీనుట్టు (చేపలకు ఆహారం అందించడం) సేవలో పాల్గొన్నారు. తీర్వా నదికి ఆలయం అనుకుని ఉండడంతో, ఆ నదిలో చేపలకి ఆహారం అందించడం ఆచారంగా వస్తోంది. ఇక్కడ చేపలకు ఆహారం అందించి మత్స్యావతార రూపుడైన విష్ణుమూర్తికి స్వయంగా ఆహారం అందించినట్టు భక్తులు భావిస్తారు. స్వామి దర్శనానంతరం వేడి వజిపాడుగా పిలిచే బాణాసంచ పేల్చే సేవలో పాల్గొన్నారు. త్రిప్రయార్ ఆలయం తెరిచి ఉన్నంత సమయం బాణాసంచా పేల్చడం ఇక్కడ ఆచారం. సీతాదేవి ఆచూకి లభించిన విషయాన్ని తన పొలికేక ద్వారా శ్రీ ఆంజనేయ స్వామి వారు శ్రీరాముడికి చేరవేయగా, రామస్వామి బాణాసంచ పేలుడుతో బదులిచ్చినట్టు పురాణాలు చెబుతున్నాయి. దాన్నే త్రిప్రయార్ శ్రీరామస్వామి ఆలయంలో నేటికీ పాటిస్తున్నారు. వేది వజిపాడుగా పిలిచే ఈ సేవలో పాల్గొన్న పవన్ కళ్యాణ్, 1,001 టపాసులు పేల్చేందుకు అయిన మొత్తాన్ని విరాళంగా సమర్పించారు. చివరిగా శ్రీ శాస్తగా భక్తులు కొలుచుకునే అయ్యప్పస్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. త్రిప్రయార్ లోని శ్రీరామ స్వామి విగ్రహం ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడిచే పూజలందుకున్నట్టు పురాణాలు చెబుతున్నాయి. ద్వారకానగరం సముద్ర గర్భంలో కలిసిపోయిన అనంతరం రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల విగ్రహాలు కేరళం తీరానికి కొట్టుకువచ్చినట్టు చరిత్ర చెబుతోంది. కేరళంలో ఆలయానికి సమీపంలో ఆయుర్వేద వైద్యం చేయించుకుంటున్న పవన్ కళ్యాణ్ శుక్రవారం స్వామి సేవలో పాల్గొన్నారు.

# కొవ్వూరు వద్ద పట్టాలు తప్పిన గూడ్స్



- ఎక్కడికక్కడ నిలిచిపోయిన రైళ్లు
- పట్టాలు తప్పిన గూడ్స్ రైలు 78 బోగీలతో

హైదరాబాద్, సెప్టెంబర్ 11, అనంత జనశక్తి న్యూస్

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాజమండ్రి నుంచి విజయవాడ వైపు వెళ్తున్న గూడ్స్ రైలులోని ఎనిమిది బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ఘటనతో పలు రైళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ప్రమాద ప్రభావంతో నార్త్ సింహాచలం, విశాఖపట్నం, దువ్వాడ, అనకాపల్లి రైల్వే స్టేషన్లలో ట్రాక్‌లు పూర్తిగా నిండిపోయాయి. దువ్వాడ రైల్వే స్టేషన్‌లో షాలిమార్, చెన్నై వైపు వెళ్లే రైళ్లు నిలిచిపోయాయి. దీంతో రైలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు 78 బోగీలతో ప్రయాణిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పారాదీప్ నుంచి ఎరువులను తీసుకుని బారామతికి వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన ప్రాంతానికి రైల్వే అధికారులు చేరుకుని సహాయక, పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నారు. కాగా, ఇదే ప్రాంతంలో రెండు వారాల క్రితం కూడా గూడ్స్ రైలు పట్టాలు తప్పిన ఘటన చోటుచేసుకుంది. తాజాగా మరోసారి అదే ప్రాంతంలో ప్రమాదం జరగడంతో రైల్వే ట్రాక్‌ల నిర్వహణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రైల్వే అధికారులు మెయింటెనెన్స్‌ను సక్రమంగా నిర్వహించకపోవడమే ప్రమాదాలకు కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# స్థానిక ఓటర్ల జాబితా విడుదల

- ఉమ్మడి జిల్లాలోని 63 మండలాల జాబితా విడుదల చేసిన జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి
- అనంతలో 31 జెడ్పీటీసీ, 450 ఎంపీటీసీ స్థానాలకు జగరగనున్న ఎన్నికలు
- మొత్తం ఓటర్లు 13,52,193 మంది
- శ్రీ సత్యసాయి జిల్లాలో 32 జెడ్పీటీసీ, 397 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు
- మొత్తం ఓటర్లు 11,65,917 మంది

అనంతపురం సెప్టెంబర్ 11, అనంత జనశక్తి న్యూస్



స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో మరో అడుగు ముందుకు పడింది. అనంతపురంలోని ఉమ్మడి జిల్లా పరిషత్ కార్యాలయంలో సీఈఓ విజయలక్ష్మి ఫొటో ఓటర్ల జాబితాను శుక్రవారం విడుదల చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 63 మండలాలు ఉండగా, 63 జెడ్పీటీసీ స్థానాలతో పాటు మొత్తం 847 ఎంపీటీసీ స్థానాలకు ఈసారి ఎన్నికలు నిర్వహించనున్నట్లు సీఈఓ తెలిపారు. గతంలో 841 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వాటి సంఖ్య 847కు పెరిగాయి. మొత్తం ఓటర్లు 25,18,110 ఉన్నారు. అందులో 12,77,947 మంది మహిళా ఓటర్లు ఉండగా, పురుష ఓటర్లు 12,40,009 ఉన్నారు.

విభజిత జిల్లాలే ప్రామాణికంగా ఎన్నికలు

రాష్ట్ర విభజన అనంతరం ప్రతి పార్లమెంట్ నియోజక వర్గాన్ని ఒక జిల్లాగా మారుస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆ విధంగా రాష్ట్రంలో 28 జిల్లాలు ఏర్పాటయ్యాయి. విభజిత జిల్లాలను ప్రామాణికంగా తీసుకొని ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించనుంది. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా విషయానికొస్తే 31 జెడ్పీటీసీ స్థానాలతో పాటు గతంలో 444 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, కొత్తగా ఏర్పాటు చేసిన ఆరు 'స్థానాలను కలుపుకొని మొత్తం 450 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు సీఈఓ విజయలక్ష్మి తెలిపారు. మొత్తం 13,52,193 మంది ఓటర్లు ఉండగా, వారిలో 6,78,835 మంది మహిళలు, 6,73,233 మంది పురుషులు, 125 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు.

శ్రీ సత్యసాయి జిల్లా విషయానికొస్తే..

మొత్తం 32 జెడ్పీటీసీ స్థానాలతో పాటు గతంలో ఉన్న 398 ఎంపీటీసీ స్థానాలకు అదనంగా కొత్తగా మరో ఎంపీటీసీ స్థానం కలుపుకొని మొత్తం 397 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు సీఈఓ వివరించారు. ఇక ఓటర్ల విషయానికొస్తే మొత్తం 12,65,917 మంది ఉండగా, వారిలో 5,99,112 మంది మహిళలు, 5,66,776 మంది పురుషులు, 29 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. ఫొటో ఓటర్ల జాబితాను విడుదల చేసిన అనంతరం జిల్లా పరిషత్ లోని నోటీసు బోర్డులోనూ ప్రదర్శనకు ఉంచారు. ఓటర్ల జాబితాలను మండలాల వారీగా పంపనున్నట్లు సీఈఓ వివరించారు.

మూడంచెల విధానంలో ఎన్నికలు?

అయితే ఈసారి మూడంచెల విధానంలో ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఆ లెక్కన గ్రామాల్లో పంచాయతీ సర్పంచ్, మండల స్థాయిలో ఎంపీపీ, జిల్లా పరిషత్ చైర్మన్ ను ప్రజలే ఓట్లు వేసి నేరుగా ఎన్నుకోనున్నారు. గతంలో అమలైన ఐదంచెల విధానంలో ఎంపీపీని ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీ చైర్మన్ ను జెడ్పీటీసీ సభ్యులు ఎన్నుకునేవారు. ఒకవేళ నచ్చకపోతే రెండున్నరేళ్ల తరువాత అవిశ్వాస తీర్మానం ద్వారా ఎంపీపీ లేదా జెడ్పీ చైర్మన్లను తొలగించే వారు. అయితే మూడంచెల విధానంలో అవిశ్వాస తీర్మాన ప్రక్రియ ఉండదు. ప్రజలే నేరుగా ఓట్లు వేసి ఎన్నుకోనున్నారు. దీని వల్ల అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టలేరు. ఒకసారి గెలిస్తే ఐదేళ్ల పాటు వారే కొనసాగుతారు.

# వడ్డెర్లకు ఏపీ ప్రభుత్వం గుడ్‌న్యూస్

- 16 జిల్లాల్లో 32 చోట్ల క్వారీ భూములు
- 50% రాయితీ ఇవ్వనున్న సర్కార్

హైదరాబాద్, సెప్టెంబర్ 11, అనంత జనశక్తి న్యూస్

వడ్డెరలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త అందించింది. రాష్ట్రవ్యాప్తంగా వడ్డెరల కోసం ప్రభుత్వ భూములను క్వారీ పూల్‌గా గుర్తించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మొత్తం 100 హెక్టార్ల ప్రభుత్వ భూములను క్వారీ పూల్‌గా అందుబాటులోకి తీసుకురానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 16 జిల్లాల్లో 32 ప్రాంతాల్లో క్వారీల కోసం ప్రభుత్వ భూములను గుర్తించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. గుర్తించిన ప్రాంతాల్లో రిజిస్టర్డ్ వడ్డెర సహకార సంఘాలకు క్వారీ లీజులు కేటాయించనున్నారు. దీంతో వడ్డెర సహకార సంఘాలకు క్వారీ కార్యకలాపాల ద్వారా ఉపాధి, ఆదాయ అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. అంతేకాకుండా క్వారీ లీజులకు సంబంధించిన అమౌంట్, సీనరేజ్ ఫీజులో 50 శాతం రాయితీ కల్పించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిర్ణయంతో వడ్డెర సంఘాలకు ఆర్థికంగా కొంత ఊరట లభించడంతో పాటు, వారి జీవనోపాధికి మరింత ప్రోత్సాహం లభించే అవకాశం ఉంది.



# రాష్ట్రంలో 3,736 మద్యం దుకాణాలే.. ఏడాది పాటు కొనసాగింపు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ నిబంధనలను అనుసరించి తదుపరి కూడా పొడిగించే అవకాశం ఉంది. మొత్తం 3,736 దుకాణాల్లో 3,396 ఓపెన్ కేటగిరీలో ఉండగా, 340 దుకాణాలను గీత కులాలకు కేటాయించారు. ఎక్సైజ్, మైన్స్ అండ్ జియాలజీ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. 201924 మధ్య అమలు చేసిన ఎక్సైజ్ విధానాలు, ప్రస్తుతం అమల్లో ఉన్న 202426 షాప్స్ పాలసీ అనుభవం, వివిధ వర్గాల నుంచి వచ్చిన అభిప్రాయాలు, మార్కెట్ పరిస్థితులు, ప్రభుత్వ ఆదాయ అంశాలను పరిశీలించిన అనంతరం 202627 పాలసీని ప్రభుత్వం ఖరారు చేసింది. ప్రస్తుత లైసెన్సుదారులకు తమ దుకాణాల లైసెన్సులను మరో ఏడాది పాటు రెన్యువల్ చేసుకునే అవకాశం కల్పించారు. ఇందుకోసం వార్షిక రిటైల్ ఎక్సైజ్ పన్నులో 38 శాతానికి సమానమైన రెన్యువల్ రిటైల్ ఎక్సైజ్ పన్నును చెల్లించాలి. దీనితో పాటు వార్షిక రిటైల్ ఎక్సైజ్ పన్ను, వర్తించే పర్మిట్ రూమ్ రిటైల్ ఎక్సైజ్ పన్నును కూడా చెల్లించాల్సి ఉంటుంది. 202627లో వార్షిక రిటైల్ ఎక్సైజ్ పన్నును 202526లో ఉన్న రేట్ల ప్రకారమే కొనసాగించారు. రెన్యువల్ రిటైల్ ఎక్సైజ్ పన్నును మొదటి విడత వార్షిక రిటైల్ ఎక్సైజ్ పన్నుతో కలిపి ఒకేసారి చెల్లించాలి. 50 వేల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో ఓపెన్ కేటగిరీ దుకాణాలకు రెన్యువల్ రిటైల్ ఎక్సైజ్ పన్ను రూ.23 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.27.2 లక్షలు, 5 లక్షలకు పైగా జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.35.5 లక్షలుగా నిర్ణయించారు. గీత కులాలకు కేటాయించిన దుకాణాలకు ఇదే కేటగిరీల్లో వరుసగా రూ.11.5 లక్షలు, రూ.13.6 లక్షలు, రూ.17.8 లక్షలుగా నిర్ణయించారు. వర్తించే దుకాణాలకు పర్మిట్ రూమ్ లైసెన్స్ తప్పనిసరి. ఇందుకు ప్రత్యేకంగా నిర్ణయించిన పర్మిట్ రూమ్ రిటైల్ ఎక్సైజ్ పన్నును చెల్లించాలి. వార్షిక రిటైల్ ఎక్సైజ్ పన్నును ప్రభుత్వం నిర్దేశించిన వాయిదాల్లో చెల్లించే అవకాశం ఉంది. వాయిదాల్లో చెల్లించే లైసెన్సుదారులు మూడు నెలల వార్షిక రిటైల్ ఎక్సైజ్ పన్ను వాయిదాకు సమానమైన మొత్తానికి బ్యాంకు గ్యారంటీ సమర్పించాల్సి ఉంటుంది. ప్రస్తుత లైసెన్సుదారులు రెన్యువల్ కోసం రూ.35 వేల ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి. ఎవరైనా లైసెన్స్ రెన్యువల్ చేసుకోకపోతే ఆ దుకాణాన్ని కొత్తగా డ్రా ఆఫ్ లాట్స్ ద్వారా కేటాయిస్తారు. ఇందుకోసం దరఖాస్తుదారులు రూ.1,000 నాన్‌రిఫండబుల్ దరఖాస్తు రుసుము చెల్లించాలి. కనీసం నాలుగు అర్హత కలిగిన దరఖాస్తులు వచ్చిన తర్వాతే డ్రా నిర్వహిస్తారు. కొత్తగా డ్రా ద్వారా కేటాయించిన దుకాణాలకు రెన్యువల్ రిటైల్ ఎక్సైజ్ పన్ను వర్తించదు. అమ్ముడుపోని లేదా కేటాయించబడని దుకాణాలను అవసరాన్ని బట్టి తిరిగి నోటిఫై చేయడం, ప్రాంతాల వారీగా హేతుబద్ధీకరించడం లేదా స్థానాలను మార్చడం వంటి చర్యలు చేపట్టేందుకు కూడా పాలసీలో అవకాశం కల్పించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎక్సైజ్ కమిషనర్ నిర్ణయిస్తారు. మద్యం సరఫరా వ్యవస్థపై డిజిటల్ నిఘాను ప్రభుత్వం మరింత బలోపేతం చేసింది. ఉత్పత్తి కేంద్రం నుంచి రిటైల్ దుకాణం వరకు మద్యం కదలికను పర్యవేక్షించే ట్రాక్ అండ్ ట్రేస్ విధానం అమలు చేయనున్నారు. దుకాణాల్లో స్టాక్, అమ్మకాల వివరాలను డిజిటల్‌గా నమోదు చేయాలి. దీనివల్ల మద్యం నిల్వలు, అమ్మకాలపై శాఖకు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుంది. ప్రతి మద్యం దుకాణంలో నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం తప్పనిసరి చేశారు. అమ్మకపు కౌంటర్, స్టాక్ ప్రాంతం, వినియోగదారుల ప్రాంతం, పర్మిట్ రూమ్‌ను కెమెరాలు కవర్ చేయాలి. వీటిని ఏఐ ఆధారిత కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసి పర్యవేక్షిస్తారు. సీసీ కెమెరాలను కావాలనే పనిచేయకుండా చేయడం లేదా వాటిలో జోక్యం చేసుకోవడంపై జరిమానాలు విధించడంతో పాటు పునరావృతమైతే లైసెన్స్ రద్దు చేసే అవకాశం ఉంది. మద్యం విక్రయాల్లో గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ) నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు విక్రయించరాదు. ఎన్‌డీపీఎల్, నకిలీ మద్యం విక్రయించడం, వివిధ బ్రాండ్ల మద్యం కలపడం, మద్యంలో నీరు లేదా ఇతర పదార్థాలు కలపడం, అనధికారికంగా నిల్వలు ఉంచడం వంటి చర్యలకు పాల్పడరాదు. ఈ నిబంధనల అమలును ఈఇన్వెంటరీ ద్వారా పర్యవేక్షిస్తారు. అనధికారికంగా మద్యం విక్రయించిన మొదటి నేరానికి రూ.25 లక్షల జరిమానా విధిస్తారు. రెండోసారి నిబంధనలను ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు చేసే అవకాశం ఉంటుంది. ఇతర ఉల్లంఘనలకు కూడా పాలసీలో నిర్దేశించిన విధంగా జరిమానాలు, చర్యలు తీసుకుంటారు. వినియోగదారులకు కూడా ఫిర్యాదులు, అభిప్రాయాలు తెలియజేసే అవకాశం కల్పించారు. దుకాణాల్లో ఎంఆర్‌పీ వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలి. వినియోగదారులు 14405 టోల్‌ఫ్రీ నంబర్, ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్, క్యూఆర్ కోడ్ ఆధారిత ఫీడ్‌బ్యాక్ ద్వారా తమ అభిప్రాయాలు, ఫిర్యాదులను తెలియజేయవచ్చు. డిజిటల్ చెల్లింపులకు కూడా అవకాశం కల్పించారు. మద్యం నాణ్యతను ఎక్సైజ్ శాఖకు చెందిన ప్రయోగశాలల ద్వారా పరీక్షించనున్నారు. అక్రమ మద్యం తయారీ, అనధికార విక్రయాలు, ఇతర ఉల్లంఘనలపై తనిఖీలు, చర్యలను కొనసాగిస్తారు. వినియోగదారులకు, లైసెన్సుదారులకు నిబంధనలపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తిరుపతి నగరంలో మద్యం దుకాణాల ఏర్పాటుపై ప్రత్యేక నిబంధనలు విధించారు. తిరుపతి రైల్వే స్టేషన్-అలిపిరి, లీలామహల్-అలిపిరి-ఎస్వీఆర్ఆర్/ఎస్వీఐఎంఎస్ మార్గాల్లో ఉత్తర్వుల్లో పేర్కొన్న ప్రాంతాల్లో మద్యం దుకాణాలకు అనుమతి ఉండదు. హైవేలకు సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కూడా పాటించాలి. మద్యం సీసాల రీసైక్లింగ్‌కు ప్రత్యేక వ్యవస్థను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం తర్వాత రూపొందిస్తుంది. లైసెన్సుదారులు ఎక్సైజ్ శాఖ ఎప్పటికప్పుడు జారీ చేసే ఆదేశాలు, లైసెన్స్ నిబంధనలు, సంబంధిత చట్టాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ యాక్ట్-1968, ఏపీ ఎక్సైజ్ రూల్స్-2024తో పాటు సంబంధిత ఇతర చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా కొత్త పాలసీ అమలు కానుంది. కొత్త పాలసీకి అనుగుణంగా అవసరమైన నిబంధనల్లో మార్పులు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అన్ని రకాల పన్నులు, ఫీజులు చెల్లించడం, నిబంధనలను పాటించడం ఆధారంగానే లైసెన్సుల రెన్యువల్, కొనసాగింపు ఉంటుంది. 202627 ఎక్సైజ్ షాప్స్ పాలసీ 2026 అక్టోబర్ 1 నుంచి 2027 సెప్టెంబర్ 30 వరకు అమల్లో ఉంటుంది. ఆర్థిక శాఖ సమ్మతితో ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది.

# జెన్ ఆల్ఫా, జెన్ బీటాపైనే నా ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

నేను కమీషన్లు తీసుకుంటున్నట్లు కొందరు ఆరోపిస్తున్నారు. ఆ అవసరం నాకేంటి? దేవుడు నాకు అన్నీ ఇచ్చాడు. ఆలోచించేలోపే పదవులన్నీ వచ్చాయి. గత 17 ఏళ్లలో జడ్పీటీసీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ, పీసీసీ చీఫ్, సీఎం అయ్యాను. నాకు డబ్బులే కావాలంటే రియల్ ఎస్టేట్ చేసుకున్నా వస్తాయి. రియల్ ఎస్టేట్‌లో ఇప్పుడు గొప్పలు చెప్పుకుంటున్న వాళ్ల తాతను నేను. అన్నీ ఉన్న నాకు కక్కుర్తి ఎందుకు ఉంటుంది? నాతో ఉన్న వాళ్లకు సహాయం చేశానే తప్ప.. ఎప్పుడూ చెడు కోరుకోలేదు. నాకేం పైశాచిక కోరికలు లేవు. ప్రశాంతంగా ఉంటాను కాబట్టే రెండు నిమిషాల్లో నిద్రలోకి వెళ్తాను.

**పాలిటెక్నిక్‌ల ప్రైవేటీకరణ ప్రశ్నే లేదు..**

పాలిటెక్నిక్‌ల ప్రైవేటీకరణ ప్రశ్నే ఉండదు. ఆ ప్రచారం వందశాతం పచ్చి అబద్ధం. ఏటీసీలు ప్రైవేటీకరణ అయ్యాయా? పాలిటెక్నిక్‌ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే.. అపోహలు సృష్టిస్తున్నారు. పాలిటెక్నిక్‌లు ఇప్పటి వరకు ఎలా ఉన్నాయో.. అలాగే ఉంటాయి. పాలిటెక్నిక్ మూడేళ్ల డిప్లొమా కోర్సు. జీవో 97లో కావాలంటే సవరణ చేస్తాం. ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో లేటరల్ ఎంట్రీ ఉంటుంది. విద్యార్థులకు అన్యాయం చేస్తే నాకేం వస్తుంది. అకడమిక్ హోదా, మూడేళ్ల డిప్లొమా కోర్సు యథాతథంగా కొనసాగుతాయి. స్కిల్ వర్సిటీకి ఏఐసీటీఈ ఆమోదం తీసుకొస్తున్నాం. సర్వీసు నిబంధనలు మార్చలేం.. మార్చినా కోర్టులు ఊరుకోవు. ఏటీసీల భూములు తీసుకోలేదు.. 282 ఎకరాలు అదనంగా ఇచ్చాం. విద్యార్థులకు అవకాశాలు ఇవ్వడం కోసమే స్కిల్ వర్సిటీలు తెచ్చాం''అని రేవంత్ వివరించారు.

# పెండింగ్ భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలి

అమరావతి, సెప్టెంబర్ 11, అనంతజనశక్తి న్యూస్

22A జాబితాలో 232 అంశాలను పరిష్కరించామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రూ.5 వేల కోట్ల విలువైన 31 వేల ఎకరాలకు విముక్తి కల్పించామని.. దీని ద్వారా లక్షలాదిమందికి లబ్ధి కలిగిందని వ్యాఖ్యానించారు. పెండింగ్ భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో రెండో రోజు జిల్లా కలెక్టర్ల సమావేశం జరిగింది. శుక్రవారం కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అంశాలపై ఆ శాఖ ఉన్నతాధికారులకు, కలెక్టర్లకు సీఎం చంద్రబాబు పలు సూచనలు చేశారు. భూ సమస్యల పరిష్కారంలో అవినీతికి తావివ్వొద్దని నిర్దేశించారు. బ్యాక్‌లాగ్ భూ వివరాలను 45 రోజుల్లో నమోదు చేయాలని సూచించారు.

**భూ వివరాలను బ్లాక్ చెయిన్‌లో ఉంచాలి..**

భూ వివరాలను బ్లాక్ చెయిన్‌లో ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రజల్లో నమ్మకం, విశ్వాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లోని భూ సమస్యలకు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం... ప్రభుత్వం తీసుకుంటున్న పాలసీల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు.

మంత్రులు, అధికారులు కూడా ఈ సమస్యలను పరిష్కరించిన విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. అంబాజీపేటలో గ్రౌండ్ రెంట్ భూముల అంశం 120 ఏళ్ల కాలం నాటి సమస్య అని.. అలాంటి సమస్యను పరిష్కరించామని స్పష్టం చేశారు. ఇలాంటి అంశాలను ప్రజలకు పూర్తిస్థాయిలో మంత్రులు, ప్రజాప్రతినిధులు వివరించాలని ఆదేశించారు. ప్రజల్లో నమ్మకం, విశ్వాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ఈ వ్యవహారాల్లో ఎక్కడా అవినీతి లేకుండా భూ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియ పూర్తైన భూములకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భద్రత కల్పించాలని తెలిపారు. నవంబర్ 1వ తేదీ నుంచి రియల్ టైమ్‌లో ఇంటిగ్రేషన్ చేయాలని ఆదేశించారు. 45 రోజుల్లో బ్యాక్ లాగ్‌లోని భూ వివరాలను బ్లాక్ చెయిన్‌లో పెట్టాలని మార్గనిర్దేశం చేశారు.

**లంచం పేరుతో ఆరోపణలు వస్తే ఊరుకునేది లేదు..**

రైల్వేకోడూరులో 10500 పట్టాల్యాండ్స్‌ను వెబ్ ల్యాండ్ ఎంట్రీలో డేటా ఎంట్రీ ఆపరేటర్ డికెటి పట్టాగా ఎక్కించారని సీఎం చంద్రబాబు తెలిపారు. నాటినుంచి వారికి లోన్లు రావడం లేదని... ఇబ్బంది పడ్డారని సీఎం చెప్పారు. అయితే ఆ సమస్యలను సరి చేస్తున్నామని అధికారులు వివరించారు. ఇలాంటి వాటి విషయంలో అధికారులు స్పందిస్తే గుడ్ విల్ వస్తుందని సీఎం పేర్కొన్నారు. అనంతపురంలో బంజరు ల్యాండ్ పేరుతో 9997 ఎకరాలు భూమి ఉందని.. ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటే 4352 మంది దీని వల్ల లబ్ధి పొందుతారని అధికారులు చెప్పారు. ఇలాంటి వాటి విషయంలో ఓ కార్యాచరణ రూపొందించి వెంటనే వీటిని పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఇలాంటి స్థలాల పంపిణీ విషయంలో సంబంధిత మంత్రి వెళ్లి సమావేశాలు పెట్టాలని.. ఆ తర్వాత పట్టాలను ఇవ్వాలని సూచించారు.

అలా చేస్తే అవినీతికి ఆస్కారం ఉండదు..

ఇలాంటి సభలు పెట్టి ఇంటి పట్టాలను పంపిణీ చేస్తే ఎక్కడా అవినీతికి ఆస్కారం ఉండదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇలాంటి వాటి విషయంలో లంచం పేరుతో ఆరోపణలు వస్తే ఊరుకునేది లేదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఈ నిర్ణయాలను అమలు చేసేటప్పుడు చిత్తశుద్ధిగా ఉండాలని ఆదేశించారు. ప్రతి 15 రోజులకు ఇలాంటి భూ సమస్యలను పరిష్కరించాలని నిర్దేశించారు. అప్పుడే ప్రజల్లోకి పాజిటివ్ మెసేజ్ వెళ్తుందని చెప్పారు. పీజీఆర్ఎస్ గ్రీవెన్స్‌లో ఇలాంటి సమస్యలు వెలుగులోకి వస్తాయని వెల్లడించారు. వెంటనే వాటిని గుర్తించి తమ దృష్టికి తీసుకురావాలని.. అప్పుడు మీరు మీ జిల్లా ప్రజలకు న్యాయం చేసే అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు.

నెల్లూరులో 2600 ఇళ్ల పట్టాలను ఇప్పటికే ఇచ్చాం: మంత్రి నారాయణ

నెల్లూరు పీజీఆర్ఎస్ గ్రీవెన్స్ ఫైలును అధికారి పీయూశ్ కుమార్ ఒక నిమిషంలోనే పరిష్కరించారని మంత్రి నారాయణ చెప్పారు. నెల్లూరులో 6000 ఇళ్ల పట్టాలు ఇస్తామన్నారని... 2600 పట్టాలు ఇప్పటికే ఇచ్చామని స్పష్టం చేశారు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
శనివారం | రంగారెడ్డి
12.09.2026



# మహేశ్వరం మండలంలో రోడ్ల సమస్యలపై మహా పాదయాత్ర

- మహేశ్వరం నుండి జిల్లా కలెక్టరేట్ వరకు మహా పాదయాత్ర
- రోడ్ల సమస్యలను పరిష్కారం చేయాలని కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి
- తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుల్లా వీరేందర్ గౌడ్
- మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్
- మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ బొక్క నర్సింహా రెడ్డి

**మహేశ్వరం, సెప్టెంబర్ 11,( అనంత జనశక్తి )**




మహేశ్వరం మండలంలో అధ్వాన్నంగా మారిన రోడ్లు, గుంతలమయంగా మారిన రహదారులతో ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర రవాణా ఇబ్బందుల పరిష్కారం కోసం ఈరోజు మహేశ్వరం నుండి కొంగరకలాన్ లోని జిల్లా కలెక్టరేట్ వరకు మహా పాదయాత్ర నిర్వహించడం జరిగింది.హెచ్.ఏ.ఎం ప్రాజెక్ట్ కింద మంజూరైనప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాని 12 రోడ్ల పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఈ పాదయాత్ర చేపట్టారు. మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని రోడ్ల దుస్థితిపై తమ నిరసన వ్యక్తం చేశారు.

అనంతరం జిల్లా కలెక్టర్ గారిని కలిసి రోడ్ల సమస్యల వివరాలతో కూడిన వినతిపత్రాన్ని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుల్లా వీరేందర్ గౌడ్, మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ అందజేశారు. వెంటనే స్పందించి రోడ్ల పనులు ప్రారంభించాలని కోరారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుల్లా వీరేందర్ గౌడ్, మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్, మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ బొక్క నర్సింహా రెడ్డి, జాతీయ కిసాన్ మోర్చా నాయకులు పాపయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ కోకన్వీనర్ కాసుల అనంతయ్య గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడారి జంగయ్య యాదవ్, సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు దేశ్యా నాయక్, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యదర్శి కుండే వెంకటేష్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి పాండు నాయక్, రాష్ట్ర గిరిజన మోర్చా కార్యవర్గ సభ్యులు పంతు నాయక్, మాజీ జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పోతర్ల సుదర్శన్ యాదవ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ మాధవ్ చారి, జిల్లా కార్యదర్శి ఆఇళ్ల యాదయ్య గౌడ్, హన్మాత్ నాయక్, కాసాని వెంకటేష్ గౌడ్, కుండే కుమార్, ప్రధాన కార్యదర్శులు వనంపల్లి శ్రవణ్, ఉపేందర్, మండల మీడియా కన్వీనర్ మోతే యాదయ్య, మండల ఉపాధ్యక్షుడు యాదగిరి, మండల కార్యదర్శి బొమ్మ దేవేందర్, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు ఎర్ర పాండు, మండల ఎస్సీ మోర్చా అధ్యక్షులు గోల్లూరు మాధవ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు రఘువీర్, మండల యువ మోర్చా అధ్యక్షులు వినోద్ నాయక్, మండల అధికార ప్రతినిధి గుత్తి రాజు, గౌరవ సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, శక్తి కేంద్ర ఇన్చార్జిలు, బూత్ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి

- ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన
- బాచుపల్లి సర్పంచ్ సబిత యుగంధర్ రెడ్డి

**కందుకూరు, సెప్టెంబర్ 11,( అనంత జనశక్తి)**



రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని బాచుపల్లి గ్రామ సర్పంచ్ కొంతం సబిత యుగంధర్ రెడ్డి అన్నారు. కందుకూరు మండల కేంద్రం బాచుపల్లి గ్రామంలో ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సబిత యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ కుటుంబాల అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ నరేష్, పాలకవర్గ సభ్యులు సి.హెచ్.కృష్ణ, డి. నర్సింహ, ఏ. రాజు, మానస,ఈ. ప్రమీల, ఈ. అనిత శాంతమ్మ, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ జి పి ఓ అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం. శ్రీశైలం, ఎం. విజయ్, వై. కె వెంకటేష్ రాఘవేందర్, ఓ. కృష్ణ, రాము , , సుధాకర్, శ్రీశైలం, రాజశేఖర్, ఈ. శంకరయ్య, కె. మహేష్, పి. మహేందర్, గ్రామ మాజీ సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## అమావాస్య సందర్భంగా
# గోమాతకు ప్రత్యేక పూజలు

**వడ్డేపల్లి, సెప్టెంబర్ 11:అనంత జనశక్తి న్యూస్**

జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమావాస్య సందర్భంగా గో ప్రచార సేవా సమితి ఆధ్వర్యంలో గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వినయ్ కుమార్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా గోమాతకు అర్చన, సంకల్పం నిర్వహించి, సమితి సభ్యులు గాయత్రి గోమాతకు గ్రాసం అందజేశారు. అనంతరం ఆలయ పైభాగంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు, శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ నాగేశ్వర స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.గోమాత చీరను లక్కీ డ్రా ద్వారా లక్ష్మణ్‌కు అందజేశారు. నేటి ప్రసాద వితరణను ఇటుకూరి పూర్ణిమ, శ్రీనివాసులు నిర్వహించారు. గోమాతకు వస్త్రధారణ కోసం కృష్ణవేణి చీరను అందజేశారు.ఈ కార్యక్రమంలో గో ప్రచార సేవా సమితి అధ్యక్షుడు రామచంద్రుడు, ఉపాధ్యక్షుడు గొంగళ్ల వెంకటరాముడు, లక్ష్మణ్, మహిళా ఉపాధ్యక్షురాలు నరసింహ శాంత, పూర్ణిమ, గుంత లక్ష్మి, లత, లలితమ్మ, కోట రజిత, గోకాపరి తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.




# పింఛన్ దరఖాస్తుకు 16వ తేది వరకు మాత్రమే గడువు

- పార్టీ నాయకులు చొరవతీసుకుని అర్హులతో దరఖాస్తు చేయించండి
- పార్టీ శ్రేణులను ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం
- ఈనెల 22న మంత్రి నారా లోకేష్ పర్యటనపై చర్చ
- పార్టీలకతీతంగా పింఛన్లు మంజూరవుతాయన్న ఎమ్మెల్యే సునీత

**రాప్తాడు సెప్టెంబర్ 11, అనంత జనశక్తి న్యూస్**



ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 16వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని.. పార్టీ నాయకులు, కార్యకర్తలు చొరవ తీసుకుని అర్హులైన వారితో దరఖాస్తు చేయించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. ఇదే అంశంపై ఆమె అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. కొత్త పింఛన్ల అంశంపై వారికి ఎమ్మెల్యే సునీత పలు సూచనలు చేశారు. మనం ఎక్కడికి వెళ్లినా..ఏ సమావేశం జరిగినా.. ఎక్కువ మంది పింఛన్లు అడిగే వారని గత వైసీపీ ప్రభుత్వంలో కొందరి పెన్షన్లను అన్యాయంగా తొలగించారన్నారు. ఈవిషయాన్ని తాము సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అసెంబ్లీలో కూడా చాలా సార్లు ప్రస్తావించామన్నారు. ఇప్పుడు 3లక్షల పింఛన్లు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారన్నారు. అయితే కొత్తగా వచ్చే పింఛన్లు అర్హులకు మాత్రమే అందేలా చూడాలన్నారు. ఇందులో పార్టీలు చూడకుండా అర్హులైన వారి చేత దరఖాస్తు చేయించాలన్నారు. సమయం తక్కువ ఉన్నందుకు పార్టీ శ్రేణులు చొరవ తీసుకోవాలన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీ శ్రేణుల ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని.. సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకునేలా సహాయం చేయాలన్నారు. కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జ్‌లు, నాయకులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. అర్హతకు అవసరమైన పత్రాలు లేదా ఏమైనా సందేహాలుంటే సచివాలయం లేక ఎంపీడీఓను సంప్రదించి స్పష్టత పొందాలని సూచించారు. ఇప్పటికే ఎస్ఐఆర్ తో పాటు ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారన్నారు. ఇందులో పాల్గొన్న ప్రతి ఒక్కర్నీ ఆమె అభినందించారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొనే ఏ సమస్య మీద అయినా తాము ఉన్నత స్థాయి వరకు తీసుకెళ్తున్నట్టు చెప్పారు. హౌస్ మ్యాపింగ్ అంశాన్ని కూడా అసెంబ్లీలో ప్రస్తావించామని.. త్వరలోనే అది కూడా వస్తే చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. మరోవైపు ఈనెల 22వ తేదీన నారా లోకేష్ రాప్తాడు పర్యటన ఉంటుందని ఎమ్మెల్యే సునీత తెలిపారు. చెన్నేకొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన కస్తూరిబా పాఠశాల అదనపు భవనాలను ప్రారంభిస్తారన్నారు. అలాగే రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర విగ్రహాలను ప్రారంభించి సభలో పాల్గొంటారన్నారు. అనంతరం కార్యకర్తల సమావేశం నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు...

# పంచాయతీ కార్మికుల జీతాల కొరకు డిపిఓ కు వినతి

**పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 11**

**అనంత జన శక్తి న్యూస్.**

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న పంచాయతీ కార్మికులు, స్వచ్ఛభారత్ కార్మికులకు. పెండింగ్ లో ఉన్న జీతాలు ఇవ్వాలని డీపీవో కార్యాలయం వద్ద నిరసన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, సీఐటీయు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాస్, సీఐటీయు జిల్లా కార్యదర్శి పైపల్లి గంగాధర్, వ్య, కా,సం, జిల్లా అధ్యక్షులు సాకే వెంకటేష్, సీఐటీయు జిల్లా కమిటీ మెంబర్ రామచంద్ర, మాట్లాడిన అనంతరం డీపీవో కి వినతి పత్రాలు అందించి జీతాలు సమస్య పరిష్కారం కాకపోతే పది రోజుల తరువాత .పుట్టపర్తి జిల్లా కేంద్రంలో డిపిఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని, ఈ ధర్నాను పంచాయతీ వర్కర్లు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొని సమస్యలు పరిస్కారం చేయాలని కోరారు. జిల్లావ్యాప్తంగా పంచాయతీ కార్మికులకు నాలుగు నెలలు జీతాలు పెండింగ్లో ఉన్నాయనీ, స్వచ్ఛభారత్ కార్మికులకు ఆరు నెలల నుండి సంవత్సరం వరకు పెండింగ్ జీతాల సమస్య పరిష్కరించాలనీ, మున్సిపాలిటీలో చెల్లించే విధంగా పంచాయతీ కార్మికులకు కూడా ప్రభుత్వమే జీతాలు చెల్లించాలనీ,.కనీస వేతనాలు 21000 అమలు చేయాలనీ, పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలనీ, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ గ్రాటిట్యూడ్ సౌకర్యం కల్పించాలనీ పనిచేస్తూ మరణించిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం మట్టి ఖర్చులు 20, వేలు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం 1999లో ఇచ్చిన జీవో 551.ప్రకారం గుర్తింపు కార్డులు పీఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించి పర్మినెంట్ చేయాలని, జీవోలో ఉన్న సత్యసాయి జిల్లాలో అమలు కావడం లేదనీ, ఈ సమస్యల కోసం గ్రామపంచాయతీ వర్కర్లు స్వచ్ఛభారత్ కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని, సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికులు రామచంద్ర జయమ్మ సుబ్బరాయప్ప, నాగప్ప ,అశోక్, సుధామణి, అంజన్నప్ప, నరసింహా మూర్తి, గంగమ్మ రత్నమ్మ సునీతమ్మ లక్ష్మీనారాయణ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.





# పాశిగామ పాఠశాల అభివృద్ధికి ఎంపీ రూ.18 లక్షలు

**పెద్దపల్లి సెప్టెంబర్ 11, అనంత జనశక్తి న్యూస్**

పాశిగామ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ రూ.18 లక్షల నిధులను మంజూరు చేశారు. ఎంపీ నిధుల నుంచి కేటాయించిన ఈ మొత్తంతో విద్యార్థులకు అవసరమైన బెంచీల ఏర్పాటు, పాఠశాలలో మౌలిక వసతుల మెరుగుదలకు చర్యలు చేపట్టనున్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు విద్యా వాతావరణాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. పాశిగామ పాఠశాల సమగ్ర అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంపై స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎంపీ వంశీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

# బెగరికంచలో భూ వివాదం



**అవార్డును నిలిపివేయాలని ఆర్డీవో కు ఫిర్యాదు**
**బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం**
**రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గుండ్రపల్లి మహేందర్**
**తెలంగాణ రాష్ట్ర మహిళా హక్కుల వేదిక అధ్యక్షురాలు ఇంద్ర**
**బడంగ్‌పేట్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు అమృత నాయుడు**

**కందుకూరు, సెప్టెంబర్ 11,( అనంత జన శక్తి)**

రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం బెగరికంచ గ్రామంలోని సర్వే నంబర్ 145 లో గల 6 ఎకరాల 37 గుంటల భూమికి సంబంధించిన అవార్డు మరియు నష్టపరిహారం ప్రక్రియపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ గోపాల భూచమ్మ ఆర్డీవో గారికి అభ్యంతర పిటిషన్ సమర్పించారు.అవార్డు లిస్టులో పేర్కొన్న 23 మంది వ్యక్తుల హక్కులు, వారికి కేటాయించిన భూమి విస్తీర్ణం, రెవెన్యూ రికార్డులు మరియు వాస్తవ స్వాధీనంలో ఉన్న భూమిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఆమె తన ఫిర్యాదులో కోరారు.విచారణ పూర్తయ్యే వరకు అవార్డు లిస్టును మరియు నష్టపరిహారం చెల్లింపుల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆర్డిఓ ని ఆమె విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గుండ్రపల్లి మహేందర్, తెలంగాణ రాష్ట్ర మహిళా హక్కుల వేదిక అధ్యక్షురాలు ఇంద్ర, బడంగ్‌పేట్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు అమృత నాయుడు, మీర్‌పేట్ మహిళా అధ్యక్షురాలు పద్మశ్రీ, అందుగుల నరేందర్, కడ్తాల్ జగన్, స్వర్ణగంటి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు అండగా ఎంపీ వంశీకృష్ణ



**గోదావరిఖని, సెప్టెంబర్ 11:అనంత జనశక్తి న్యూస్**

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ గోదావరిఖనిలో శుక్రవారం పర్యటించి పలువురు కుటుంబాలను పరామర్శించారు. స్థానిక గంగానగర్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాల్వ లింగస్వామి నివాసానికి వెళ్లిన ఎంపీ.. ఆయన కుమారుడు రాహుల్ యాదవ్, కోడలు దివ్యలను ఆశీర్వదించారు. అనంతరం సుందిళ్ల గ్రామంలోని కనుగుల నారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి బ్యూరో చీఫ్ నవీన్ కుటుంబ సభ్యులను కూడా కలిసి ఓదార్చారు. నవీన్ తండ్రి వీరస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే గోదావరిఖని సిటీ కేబుల్ ఎండీ స్వామిగౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆయన తండ్రి రాజయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**ప్రమాదంలో గాయపడిన కార్మికుడికి పరామర్శ**

ఇటీవల గోదావరిఖని 11వ బొగ్గు గనిలో జరిగిన ప్రమాదంలో గాయపడిన సింగరేణి కార్మికుడు సాగర్‌ను ఎంపీ వంశీకృష్ణ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ పర్యటనలో ఎంపీ వంశీకృష్ణ వెంట ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయకులు బాబర్ సలీం పాషా, గుమ్మడి కుమారస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.


# త్వరలోనే పాలిటెక్నిక్ విద్యార్థులకు గుడ్‌న్యూస్: మంత్రి వివేక్

**త్వరలోనే పాలిటెక్నిక్ విద్యార్థులకు గుడ్‌న్యూస్ చెబుతామని తెలంగాణ మంత్రి వివేక్ తెలిపారు. జీవో నంబర్ 97లో మార్పులు తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. శాసనసభలో విద్యాసంస్కరణలపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు.**
**"పాలిటెక్నిక్ విద్యను రూ.8వేల కోట్లతో ఆధునికీకరించాలని భావిస్తున్నాం. పాలిటెక్నిక్ విద్య ప్రైవేటీకరణ అవుతుందని అపోహలు ఉన్నాయి. ఇది ప్రభుత్వ అధీనంలోనే ఉంటుంది. ఏఐసీటీఈ సర్టిఫికెట్ కొనసాగుతుందని విద్యార్థులకు చెప్పాం. ఇంజినీరింగ్‌లో లేటరల్ ఎంట్రీ ఉంటుందని వివరించాం. కొత్త కోర్సులపై అధ్యాపకులకు శిక్షణ ఇస్తాం" అని వివేక్ వివరించారు.**



# కార్పొరేట్ జాబ్‌లో వచ్చే వర్క్ టెన్షన్స్‌ని ఎలా మేనేజ్ చేయాలి, హ్యాపీగా ఏ భయం లేకుండా ఎలా జాబ్ చేయాలి

మనం జాబ్ చేసినప్పుడు సవాలక్ష టెన్షన్స్ ఉంటాయి. వాటన్నింటినీ చాలా మంది అలానే తీసుకుంటూ జాబ్‌ని కంటిన్యూ చేస్తారు. దీనికి కారణం నెలనెలా వచ్చే జీతం. చాలా మంది జాబ్ చేసేవారిని దగ్గరికి వెళ్ళి మందలిస్తే వారిలోని ఆందోళన అంతా ఒక్కసారిగా నేను బాగున్నాను అనే మాటలోనే కనిపిస్తుంది. మనకి అప్పగించిన పని గురించి బాస్ వచ్చి ఎలా ఉన్నారు అనగానే... బాగున్నాను అనే మాట చెప్పడం కంటే ముందుగా మనకి అప్పగించిన పనే గుర్తుకొస్తుంది. దీంతో ఏదో అద్దె నవ్వుని ముఖాన పులుముకుని నేను బాగానే ఉన్నాను, మీరు ఇచ్చిన పనిని పూర్తి చేస్తాను. అని చెబుతుంటారు.









వరల్డ్ మెంటల్ హెల్త్ డే

బిజీ బిజీ ప్రపంచంలో ఈ కార్పొరేట్ యుగంలో ఏ ఉద్యోగికి కూడా మానసిక ప్రశాంతత లేకుండా పోయింది. ప్రతీ ఒక్కరూ నేను బాగున్నాను అని చెబుతున్నారు. కానీ, ఇది మాట వరకే, దీనిని అంతమొందించాలి. దానికోసం ప్రతీ ఒక్కరూ కూడా కొన్ని విషయాల్ని ఫాలో అవ్వాలి. ఎందుకంటే ఇలా చెబుతూనే ఉంటారు. కానీ, వారి మనసులోని బాధ అలానే పెరిగిపోయి అది డిప్రెషన్‌లా మారే అవకాశం ఉంది. కాబట్టి, జాగ్రత్తగా ఉండాలి.

పని ఒత్తిడి పెరిగితే

అదో రకమైన ఆందోళన ఉంటుంది. దీంతో రోజువారీ పనులు చేయడం కష్టంగా మారుతుంది. ఎనిమిది గంటల నిద్ర కరువైపోతుంది. మానసిక ఒత్తిడి పెరుగుతుంది. శారీరకంగా అలసిపోతారు.

వచ్చే సమస్యలు

ఇలా నేను బాగున్నాను అంటూ పైకి చెప్పేవారు లోలోపలే కుమిలిపోతుండడాన్ని ఎవరు గమనించరు. వారో నిరాశవాదిగా మారతారు. కుటుంబానికి, తల్లీదండ్రులకి, అందరికీ మానసికంగా దూరమైపోతారు. ఖర్చులు, ఒత్తిడి, నిరంతరాయంగా చేసే పనులు రిలేషన్స్‌ని కూడా దెబ్బతీస్తాయి.

బాగున్నామనే మాట వెనుక ఏం దాచిపెడుతున్నాం

హైబ్రిడ్ హ్యాంగోవర్ : అంటే ఎంప్లాయిస్, హైబ్రిడ్ వర్క్ మోడల్‌కి మారేటప్పుడు ఫేస్ చేసే ఛాలెంజెస్ అని అర్థం. దీని వల్ల సమస్యలొస్తాయని చెబుతుండడం

ఇంపోస్టర్ సిడ్రోమ్ : అంటే మీరు మీకున్న స్కిల్స్, సక్సెస్‌ని అనుమానించడం. ఇతరులు మిమ్మల్ని నమ్మినప్పటికీ మీకు టాలెంట్ లేదని వారెక్కడ అనుకుంటోరనని భయం. ఇది మానసిక సమస్య కానప్పటికీ, దీని వల్ల కాస్తా సమస్య వస్తుంది.

సైలెంట్ దు:ఖం : సమస్య ఉన్నప్పటికీ, ఇష్టమైన వారికోసం అలసిపోయినట్లుగా కనిపించకుండా ఉండడం

బర్నౌట్ : ఎక్కువగా ఒత్తిడి వల్ల వచ్చే భావోద్వేగా, శారీరక, మానసిక అలసట.

సరిగ్గా పనిచేయడం కోసం


బాగున్నాను అనే మాటని నిజమైన అర్థం వచ్చేలా చేయాలి. దీనికోసం ఎంప్లాయిస్ కొన్ని చేయాలి. వీకెండ్‌లో పూర్తిగా రీచార్జ్ అవ్వడానికి లీవ్ తీసుకోవడం. పనిభారాలని తగ్గించుకోండి. లక్ష్యాలను చేరుకోవడానికి మీరు కష్టపడుతున్నా చేరుకోవట్లేదంటే అవి టైమ్ మేనేజ్‌మెంట్ ప్రాబ్లమ్ కాదు. అవాస్తవిక లక్ష్యాలు.

మీరు మేనేజర్‌తో మాట్లాడండి. మీరు అలసిపోతే మీ మేనేజర్‌కి తెలియజేయండి.


దీంతో చాలా వరకూ మీ సమస్య నుండి బయటపడే అవకాశం ఉంటుంది. ముందుగా మీరు ఎలా ఫీల్ అవుతున్నారో తెలుసుకోవాలి. బాలేకపోవడాన్ని యాక్సెప్ట్ చేయాలి. మీరు మెంటల్లీ హెల్దీగా ఉన్నప్పుడే ఫిజికల్‌గా కూడా ప్రొడక్టివ్ వర్క్ చేస్తారు. ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి.

# 6 యోగా భంగిమలతో అధిక యూరిక్ యాసిడ్ స్థాయిలకు చెక్






కీళ్ల నొప్పులు, గౌట్‌కు దారితీసే అధిక యూరిక్ యాసిడ్ ను తగ్గించుకోవడానికి యోగా గురువు హిమాలయన్ సిద్ధ అక్షర్ 6 ప్రభావవంతమైన ఆసనాలను సిఫార్సు చేశారు. ఈ ఆసనాలు జీవక్రియను వేగవంతం చేస్తాయి, రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి, తద్వారా మూత్రపిండాలు, కాలేయ పనితీరును ఉత్తేజపరచి, శరీరం నుండి విషపదార్థాలు, యూరిక్ యాసిడ్‌ను సమర్థవంతంగా బయటకు పంపడానికి తోడ్పడతాయి. రోజువారీ సాధనతో గౌట్ ప్రమాదాన్ని తగ్గించవచ్చు.







యూరిక్ యాసిడ్ ఎందుకు పెరుగుతుంది?

యూరిక్ యాసిడ్ అనేది మన శరీరం పురీన్‌లను (కార్బన్, నైట్రోజన్‌తో కూడిన రసాయన సమ్మేళనాలు) విచ్ఛిన్నం చేసినప్పుడు ఏర్పడే ఒక వ్యర్థ పదార్థం. పురీన్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకున్నప్పుడు, ఈ యూరిక్ యాసిడ్ నిశ్శబ్దంగా పెరిగిపోతుంది. స్థాయిలు అధికమైనప్పుడు, అది హైపర్‌యూరిసెమియాకు దారితీస్తుంది. దీనివల్ల యూరిక్ యాసిడ్ క్రిస్టల్స్‌గా మారి, కీళ్లలో పేరుకుపోయి, తీవ్రమైన నొప్పి, వాపుతో కూడిన గౌట్‌కు కారణమవుతుంది. ఈ పరిస్థితికి మందులు ఉన్నప్పటికీ, యోగా అనేది సమతుల్యతను తీసుకురావడానికి ఒక సహజమైన మార్గం.

"అధిక యూరిక్ యాసిడ్ వల్ల కీళ్లలో అసౌకర్యం, నొప్పి, వాపు, బిగుతు ఏర్పడతాయి. ఈ అసమతుల్యతను నిర్వహించడానికి యోగా అనేది సహజమైన, ప్రభావవంతమైన మార్గం. క్రమం తప్పకుండా సాధన చేయడం వల్ల యోగా జీవక్రియను ప్రోత్సహిస్తుంది, రక్త ప్రసరణను పెంచుతుంది. శరీరం నుండి విషపదార్థాలను సమర్థవంతంగా బయటకు పంపడానికి సహాయపడుతుంది" అని యోగా మరియు ఆధ్యాత్మిక గురువు హిమాలయన్ సిద్ధ అక్షర్ వెల్లడించారు. యోగా రక్త ప్రసరణను మెరుగుపరచడం, శరీరంలోని విషాన్ని తొలగించడంలో సహాయపడడం, జీవక్రియను పెంచడం ద్వారా యూరిక్ యాసిడ్‌ను మరింత సమర్థవంతంగా ప్రాసెస్ చేయడానికి శరీరానికి సహాయపడుతుంది.

1. అర్ధ మత్స్యేంద్రాసనం

ఈ ఆసనం ఉదర అవయవాలకు మసాజ్ చేయడం ద్వారా, కాలేయం , మూత్రపిండాలను ఉత్తేజపరచడం ద్వారా శరీరంలోని విషపదార్థాలను బయటకు పంపుతుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, వెన్నెముకను ఆరోగ్యంగా ఉంచుతుంది.

2. భుజంగాసనం

"ఈ భంగిమ వెన్నెముకను బలపరుస్తుంది. అలాగే, ఉదరం వైపు రక్త ప్రవాహాన్ని పెంచుతుంది. ఇది డిటాక్సిఫికేషన్‌కు సహాయపడుతుంది. ఇది బిగుతును తగ్గిస్తుంది, శరీరానికి శక్తినిస్తుంది, మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది" అని అక్షర్ వివరించారు.

ఈ శక్తివంతమైన ఆసనం జీర్ణక్రియకు సహాయపడుతుంది. వాయువును తగ్గిస్తుంది. యూరిక్ యాసిడ్ నిర్వహణకు కీలకమైన మూత్రపిండాలు, కాలేయ పనితీరుకు తోడ్పడుతుంది. ఇది దిగువ వీపు , కీళ్ళను కూడా రిలాక్స్ చేస్తుంది.

4. త్రికోణాసనం

ఈ నిలబడి చేసే ఆసనం వశ్యతను పెంచుతుంది. రక్త ప్రవాహాన్ని మెరుగుపరుస్తుంది. వెన్నెముకను బలపరుస్తుంది. ఇది ఉదర అవయవాలను ఉత్తేజపరుస్తుంది. విషపదార్థాలను సమర్థవంతంగా తొలగించడానికి శరీరానికి సహాయపడుతుంది.

5. ఉత్తానాసనం

"ఈ ప్రశాంతతను ఇచ్చే భంగిమ మెదడుకు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. వెన్నెముక, తొడ కండరాలను సాగదీస్తుంది. అలాగే, డిటాక్సిఫికేషన్‌కు మద్దతు ఇస్తుంది" అని అక్షర్ వివరిస్తున్నారు. ఇది ఒత్తిడిని తగ్గిస్తుంది, విశ్రాంతిని ప్రోత్సహిస్తుంది.

6. శవాసనం

విశ్రాంతిని ఇచ్చే ఆసనం అయిన శవాసనం, యోగా ప్రయోజనాలను శరీరం గ్రహించడానికి వీలు కల్పిస్తుంది. ఇది ఒత్తిడి హార్మోన్లను తగ్గిస్తుంది. నిద్రను మెరుగుపరుస్తుంది. శరీరం సహజంగా కోలుకోవడానికి సహాయపడుతుంది.

అనంత జనశక్తి

శనివారం | రంగారెడ్డి
12.09.2026



# అవును! 'ది ప్యారడైజ్' ట్రైలర్ లేదు.. స్పష్టం చేసిన నాని



'ది ప్యారడైజ్' మూవీకి ట్రైలర్ లేదని ఆ చిత్ర కథానాయకుడు నాని స్పష్టం చేశారు. విడుదల తేదీకి తక్కువ సమయం ఉండటంతో ట్రైలర్ ఇవ్వడం సాధ్యం కాదన్నారు. సెప్టెంబరు 24న మూవీ విడుదల కానున్న నేపథ్యంలో శుక్రవారం 'ది ప్యారడైజ్' టీమ్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. కథానాయకుడు నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ కార్యక్రమంలో మాట్లాడారు. "ది ప్యారడైజ్'కు ట్రైలర్ లేదు. ఎందుకంటే నాణ్యతతో కూడిన సినిమాను ప్రేక్షకులకు అందించడానికి చాలా టీమ్‌లు పనిచేస్తున్నాయి. మీకు ఇస్తే అదిరిపోయే ట్రైలర్ ఇవ్వాలి. అది కావాలంటే, నాలుగైదు రోజులు శ్రీకాంత్, అనిరుధ్ అందరూ దానిపై పనిచేయాలి. విడుదలకు తక్కువ సమయం ఉన్న పరిస్థితుల్లో మాకు సినిమానే ముఖ్యం. తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకున్నాం" అని నాని అన్నారు.

# వాయువ్ ఫస్ట్ బర్త్‌డే.. వరుణ్ తేజ్ ఎమోషనల్ పోస్టు!





తన కుమారుడి తొలి పుట్టినరోజు సందర్భంగా టాలీవుడ్ హీరో వరుణ్ తేజ్ ఎమోషనల్ పోస్టు పెట్టారు. బర్త్ డే విషెస్ చెబుతూ వాయువ్ తేజ్‌తో ఉన్న ఫోటోలను ఎక్స్ వేదికగా పంచుకు న్నారు. " నువ్వు నా ప్రపం చాన్ని ఎంతో అద్భుతంగా మార్చేశావ్. నిన్ను చూడకముందే నీతో ప్రేమలో పడిపోయా. నీకు తండ్రిగా ఉండటం నా జీవితంలో ఎంతో అంద మైన విషయం. హ్యాపీ బర్త్ డే వాయువ్.." అని పోస్టులో పేర్కొన్నారు. 2017లో 'మిస్టర్' సినిమా కోసం వరుణ్ - లావణ్య తొలిసారి కలిసి నటించారు. అప్పడే ఇద్దరూ మంచి స్నేహితులయ్యారు. 2023 నవంబర్ 1న ఇటలీలోని టస్కానీ వేదికగా వివాహబంధంతో ఒక్కటయ్యారు. గత ఏడాది సెప్టెంబర్ 10న వీరికి కుమారుడు పుట్టిన విషయం తెలిసిందే.

# ఆ నిబంధనలు మహిళలకే ఎందుకు? వివాహ సంప్రదాయాలపై నమిత వ్యాఖ్యలు



తమిళ, తెలుగు చిత్రాలతో ప్రేక్షకులకు సుపరిచితమైన నటి నమిత . ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ భామ.. పురుషులకు లేని కొన్ని నిబంధనలు మహిళలకే ఎందుకంటూ ప్రశ్నించారు. వివాహ సంప్రదాయాలు, మహిళలపై సమాజం మోపుతున్న బాధ్యతలపై ఆమె పలు వ్యాఖ్యలు చేశారు.

"తాళి మహిళలే ఎందుకు ధరించాలి? ఆడవాళ్లే బొట్టు పెట్టుకోవాలని, సంప్రదాయాలు పాటించాలని ఎందుకు ఆశిస్తారు? పురుషులకు లేని ఈ నిబంధనలన్నీ మహిళలకే ఎందుకు?" అని నమిత ప్రశ్నలు కురిపించారు. భర్త దీర్ఘాయుష్షు  కోసం మహిళలు చేసే వరలక్ష్మీ వ్రతం లాంటి ఆచారాలపైనా ఆమె స్పందించారు. 'నా భర్త సురక్షితంగా ఉండాలని నేను ఉపవాసం ఉంటాను. కానీ, భార్య క్షేమం కోసం భర్త కనీసం ఏడాదిలో ఒక్క రోజైనా కేటాయించాలనే నియమం ఉందా? అలాంటిదేమీ లేదు. సమాజం అలాంటివి ఎందుకు సృష్టించలేదు? అన్ని నిబంధనలూ మహిళలకే ఎందుకు?' అని ఆమె ప్రశ్నించారు

మహిళలు తాళి ధరించాలని ఏ గ్రంథాల్లోనూ లేదన్నారు. 'ఇవన్నీ సమాజం సృష్టించినవే. ఎందులోనూ ఇలాంటి నిబంధనలు లేవు' అని అభిప్రాయపడ్డారు. నమిత చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. కాగా, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఎన్నో హిట్ చిత్రాల్లో నటించిన నమిత.. 2020లో వచ్చిన తమిళ చిత్రం 'మియా' తర్వాత మరే కొత్త సినిమాకు అంగీకరించలేదు.

# ధమ్ ధమ్ చకోరా



శ్రవణ్, మలైకా టి.వాసుపల్ జంటగా సంగీత ప్రధానమైన ప్రేమకథతో రూపొందుతున్న చిత్రం 'చకోర - లూనార్ లవ్ బర్డ్'. మంగా శ్రీనివాస్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ దగ్గర పనిచేసిన సహాయ దర్శకుడీయన. చింతాడ హేమారావు నిర్మాత. 'ధమ్ ధమ్'... అంటూ సాగే ఈ చిత్రంలోని పాటని ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి. ప్రకాశ్‌కుమార్ విడుదల చేశారు. ప్రిన్స్ హెన్రీ స్వర కల్పనలోని ఈ గీతాన్ని రామజోగయ్య శాస్త్రి రచించగా, అభిఖ్య తనికెళ్ల ఆలపించారు. "సరికొత్త ప్రేమకథతో తెరకెక్కిస్తున్న చిత్రమిది. యువతరాన్ని ఉర్రూతలూగించే పాటలుంటాయి. అక్టోబరు 8న ప్రపంచ వ్యాప్తంగా చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తుంద"ని సినీ వర్గాలు చెప్పాయి. అనుష్క లూహార్, యామిని, ఎల్.బి.శ్రీరామ్, సుమన్, బ్రహ్మాజీ, ఇంద్రజ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: రుప్ప గోపీకృష్ణ, కూర్పు: మార్తాండ్ కె.వెంకటేశ్.

# ఆటలో సెన్సేషన్.. మాటల్లో ఫన్: వైభవ్ అంటేనే వైరల్..!



ఓ వైపు తన వయసులోని పిల్లలు తోటి స్నేహితులతో గల్లీల్లో ఆడుకుంటుంటే.. ఈ 15 ఏళ్ల కుర్రాడు మాత్రం అంతర్జాతీయ క్రికెట్ బరిలోకి దిగాడు. బ్యాటింగ్‌లోనే కాదు.. బాడీ లాంగ్వేజ్‌లోనూ టెంపర్‌మెంట్ ఉందనే వ్యాఖ్యలు వినిపించాయి. కానీ, దులీప్ ట్రోఫీలో సందర్భోచితంగా వ్యవహరించిన తీరు అభిమానులను ఆకట్టుకుంది. ఇంతకీ ఆ సంచలనం ఎవరో ఇప్పటికే అర్థమై ఉంటుందిగా.. అదేనండీ మన చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ..

భారత A జట్టు తరపున శ్రీలంక పర్యటనకు వెళ్లినప్పుడు ఏం జరిగిందో అంతా చూశారు. అంతకుముందు అండర్ -19 వరల్డ్ కప్‌లోనూ ఇదే ధోరణి. అబ్బో.. ఈ కుర్రాడి ప్రవర్తన మరీ దుందుడుకుగా ఉందే అనే విమర్శలూ వచ్చాయి. కానీ, తాజాగా దులీప్ ట్రోఫీలో అతడు చూపించిన పరిణతి అద్భుతమనే చెప్పాలి. తనలో కేవలం టెంపర్ మాత్రమే కాదు హాస్య చతురతా ఉందని నిరూపించాడు. పరిస్థితులకు తగ్గట్టుగా మారిపోతానని వైభవ్ చేసి చూపించాడు. అందుకు తిలక్ వర్మ, ఇషాన్ కిషన్‌తో జరిగిన సంభాషణే ప్రత్యక్ష ఉదాహరణలు.

**సారు.. నన్నూ ఏడిపించాడండీ**

దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో తిలక్ వర్మను వైభవ్ సూర్యవంశీ ఉడికించాడు. బ్యాటింగ్ చేస్తోన్న తిలక్‌ను రెచ్చగొట్టేలా ఏవో కామెంట్లు చేస్తూ తాకుతూ వెళ్లాడు. వెంటనే తిలక్ అక్కడే ఉన్న అంపైర్‌తో "చూడండి సర్.. వైభవ్ ఏదో అంటున్నాడు" అని ఫిర్యాదు చేశాడు. ఆ వెంటనే వైభవ్ స్పందిస్తూ 'సార్.. నన్నూ తొలి ఇన్నింగ్స్ సమయంలో ఏడిపించాడండీ. నాకూ ఇలాగే జరిగింది' అని అనడంతో అంతా నవ్వేశారు. అంతకుముందు వైభవ్ బ్యాటింగ్ సమయంలోనూ తిలక్ చాలా దగ్గరగా వెళ్లి 'కమాన్' అన్నట్లు ఆటపట్టించాడు.

సమయస్ఫూర్తిగా స్పందిస్తూ..

మైదానంలో ఎలాంటి ప్రత్యర్థితో ఏం మాట్లాడాలో బాగా తెలిసిన వైభవ్.. బయట కూడా అంతే సమయస్ఫూర్తితో సమాధానాలు ఇస్తాడు. దులీప్ ట్రోఫీ ముగిసిన తర్వాత ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్‌తో సూర్యవంశీ సరదాగా సంభాషించాడు. వీరిద్దరూ బిహార్ నుంచి వచ్చినవారే. ఇషాన్ గైర్హాజరీలో వైభవ్ జట్టుకు కాసేపు సారథిగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. అప్పుడు ఓ డీఆర్ఎస్ తీసుకుని సక్సెస్ అయ్యాడు. ఆ తర్వాత ప్రతి సక్సెస్ డీఆర్ఎస్ విషయంలోనూ ఇలానే తనకంటే ముందే వైభవ్ చెప్పి క్రెడిట్ కొట్టేసేవాడని.. సోషల్ మీడియాలో అంతా వైభవ్‌నే పొగిడేవారంటూ ఇషాన్ వ్యాఖ్యానించాడు. ఆ వెంటనే వైభవ్ స్పందిస్తూ.. "అయితే, మీరు మైదానం వీడిన తర్వాత ఎవరు రివ్యూలు తీసుకున్నారో అదీ చెప్పండి" అని అడిగేశాడు. 'అవును బాబూ. నువ్వే. భవిష్యత్తు సారథివి సరేనా?' అని ఇషాన్ అనడంతో ఇద్దరూ నవ్వేశారు. ఈస్ట్ జోన్ జట్టు కెప్టెన్ ఇషాన్ అయితే.. అతడికి డిప్యూటీ వైభవ్ సూర్యవంశీనే.

# సెహ్వాగ్ కంటే గొప్పనా?: ఆయూబ్‌ను ఆడించడంపై నాజర్ హుస్సేన్ విమర్శలు



పాకిస్థాన్ క్రికెట్ టీమ్ తీసుకునే ప్రతి నిర్ణయమూ విమర్శలకు దారితీస్తోంది. పర్యటన మధ్యలోనే ఏడుగురు ఆటగాళ్లను స్వదేశానికి పంపింది. సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆడని సైమ్ ఆయూబ్‌ను ఏకంగా తుది జట్టులోకి తీసుకుంది. తీరా, ఆ ఆటగాడు ఘోరమైన ప్రదర్శన చేశాడు. ఇంగ్లాండ్‌తో మూడో టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ డకౌట్‌గా పెవిలియన్‌కు చేరాడు. దీంతో సైమ్‌తోపాటు పాక్ మేనేజ్‌మెంట్ తీరును ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ నాజర్ హుస్సేన్ విమర్శించాడు. ఈ క్రమంలో టీమ్ఇండియా మాజీ ఆటగాడు వీరేంద్ర సెహ్వాగ్‌ను  ఉదాహరణగా పేర్కొనడం గమనార్హం.

"సైమ్ ఆయూబ్  చివరిసారిగా 2025 అక్టోబర్‌లో ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆడిందే లేదు. సీపీఎల్ టీ20 క్రికెట్ బరిలో ఉన్న అతడు.. అక్కడ్నుంచి నేరుగా ఇంగ్లాండ్ గడ్డపై అడుగు పెట్టాడు. విదేశీ పిచ్‌లపై కనీసం అవగాహన లేని కుర్రాడిని ఇలా పంపించాలని ఎవరు నిర్ణయం తీసుకున్నారో అర్థం కావడం లేదు. రాబిన్‌సన్‌తో కూడిన ఇంగ్లాండ్ బౌలింగ్ ఎటాక్‌ను అతడు ఎలా ఎదుర్కొంటాడని భావించారో? ఇలాంటి నిర్ణయాలతో టెస్టు క్రికెట్‌ను అగౌరవపరిచినట్లే. మీరు ఏ క్రికెటర్‌నైనా అడగండి.. టెస్టు ఫార్మాట్ చాలా క్లిష్టమైందనే చెబుతారు. ఇక ఇంగ్లిష్ గడ్డపై టాప్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేయడమంటే అత్యంత కఠినం. కానీ, మీరు మాత్రం ఎక్కడో ఉన్న ఓ ప్లేయర్‌ను తీసుకొచ్చి 'గుడ్ లక్' అని చెప్పి ఇక్కడ వదిలేశారు. కానీ, ఆ కుర్రాడు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సున్నాకే పరిమితమయ్యాడు" అని నాజర్ విమర్శించాడు.

**2011లోనూ..**

భారత్ 2011లో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లింది. సిరీస్ మధ్యలోనే స్వదేశంలో ఉన్న వీరేంద్ర సెహ్వాగ్‌ను టీమ్ఇండియా పిలిపించింది. మూడో టెస్టుకు నేరుగా ఓపెనర్‌గా బరిలోకి దింపింది. కానీ, సెహ్వాగ్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ డకౌట్‌గా పెవిలియన్‌కు చేరాడు. ఇప్పుడు దానిని ఉదహరిస్తూ ఆయూబ్‌పై నాజర్ విమర్శలు చేశాడు. "ఇదే ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో సెహ్వాగ్ కూడా రెండు ఇన్నింగ్స్‌ల్లో పరుగులేమీ చేయలేదు. అతడిని కూడా భారత్ నుంచి అర్ధంతరంగా తెప్పించారు. ఎంతో అనుభవం కలిగిన సెహ్వాగ్ కూడా ఈ పిచ్‌పై ఇబ్బంది పడ్డాడు. అతడి కంటే ఆయూబ్ ఏమైనా గొప్పవాడా?" అని హుస్సేన్ వ్యాఖ్యానించాడు.

# సచిన్ రికార్డ్‌కు దగ్గరగా జో రూట్.. వివ్ రిచర్డ్స్ ఆసక్తికర కామెంట్స్



సృష్టించిన రికార్డులు కోకొల్లలు. టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా సచిన్ ఇప్పటికీ కొనసాగుతున్నాడు. ఈ రికార్డుకు ఇంగ్లాండ్ కెప్టెన్ జో రూట్ చేరువగా వచ్చాడు. సచిన్ ఖాతాలో 15,921 పరుగులు ఉండగా.. రూట్ ఇప్పటి వరకు 14,208 రన్స్ సాధించాడు. ప్రస్తుతం మంచి ఫామ్‌లోనే ఉన్న అతడు కనీసం రెండేళ్లు ఆడితే చాలు సచిన్‌ను అధిగమించడం పెద్ద కష్టమేం కాదు. ఈ క్రమంలో క్రికెట్ దిగ్గజం వివ్ రిచర్డ్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జెఫ్రీ బాయ్‌కాట్ కంటే రూట్ బెటర్ బ్యాటర్‌గా నిరూపించుకున్నట్లేనని సరదాగా కామెంట్ చేశాడు.

"ఇప్పుడు జో రూట్ కెప్టెన్. తప్పకుండా తుది జట్టులో ఉంటాడు. సచిన్ రికార్డును అధిగమించడానికి అనుకూలమైన పరిస్థితుల్లోనే ఉన్నాడు. క్రికెట్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోతుంది. అంతేకాకుండా ఇంగ్లాండ్ దిగ్గజం జెఫ్రీ బాయ్‌కాట్‌కూ ఓ సందేశం పంపినట్లు అవుతుంది. యార్క్‌షైర్ నుంచి వచ్చిన అత్యుత్తమ బ్యాటర్ ఇక నుంచి రూట్ అని బాయ్‌కాట్‌కు చెప్పినట్లు అవుతుంది" అని రిచర్డ్స్ వెల్లడించాడు.

**మా అబ్బాయికి మంచి రికార్డు ఉంది: మ్యాట్ రూట్**

రూట్ తండ్రి మ్యాట్ రూట్ ఈ రికార్డుపై తన అభిప్రాయం వెల్లడించాడు. "గతంలో కెప్టెన్‌గా ఉన్నప్పుడు రూట్ ఒక్క ఏడాదిలోనే 1,700 పరుగులు రాబట్టాడు. కెప్టెన్సీ భారం కాదని నిరూపించాడు. ఫిట్‌గా, ఏకాగ్రతతో ఉండి.. ఆడాలనే కోరిక ఉన్నంతకాలం సచిన్ రికార్డును అందుకోవడం పెద్ద కష్టమేం కాదు" అని మ్యాట్  తెలిపారు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945